



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి **-గుంటూరు,మార్చి 25 (వార్తాప్రభ) :**


| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 338 | ది. 26-3-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 338 | Date : 26-3-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


# పర్యాటకులు పెరిగేలా ప్రణాళికలు

- బారువ నుంచి నెల్లూరు వరకూ బీచ్‌ల అభివృద్ధి
- పర్యాటకుల కోసం హోటళ్లు, హోంస్టేలు పెంచేలా కార్యాచరణ
- కారావాన్ పార్కులు... టెంట్ సిటీలు ఏర్పాటుకు చర్యలు
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ
- పర్యాటక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**అమరావతి,మార్చి 25 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా ఏపీలో హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సీఎం సూచనలు జారీ చేశారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు. అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్‌ను ఆగస్టు నాటికి, హావ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**పర్యాటక ప్రోత్సాహానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ..** రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సీఎం దిశానిర్దేశం చేశారు. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సీఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హౌస్ బోట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని సీఎం సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామీనీ ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు. బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్ కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని ఈ ఏడాదిలో 9 నెలల కాలానికి గానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని.. ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

# పేదల సంక్షేమ చర్చకు ప్రతిపక్షం పరారు

## : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎన్ని కోట్లయినా ఇస్తాం
- వారం వారం బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం సిద్ధం




**హైదరాబాద్,మార్చి 25 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని పేదల సంక్షేమం గురించి అసెంబ్లీలో వినడానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు మనసు లేదని, అందుకే బడ్జెట్ సమాధానం వినకుండా సభ నుంచి పారిపోయారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బుధవారం అసెంబ్లీలో 'ప్రశ్నోత్తరాల సమయం'లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. "బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిధులు తగ్గించామంటూ విపక్షాలు మాట్లాడడం సరికాదు. గత బడ్జెట్‌లోనే ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏకంగా ?22,500 కోట్లు కేటాయించాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా సభలు నిర్వహించి పారదర్శకంగా దరఖాస్తులు స్వీకరించాం." హౌసింగ్ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి గారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని భట్టి తెలిపారు. పనులు వేగవంతం చేసేందుకు గతంలో లాగా నెలల తరబడి వేచి చూడకుండా, వారానికోసారి బిల్లులు చెల్లించేలా నిక్కచ్చిగా ఆదేశాలు జారీ చేశామన్నారు. "ఇల్లు కట్టండి.. బిల్లు తీసుకోండి" అనే నినాదంతో లబ్ధిదారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. "రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదన్నదే మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ రాజ్యంలో పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న ఉన్నత లక్ష్యంతోనే భారీగా నిధులు కేటాయించాం. ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల కోసం వెనకడుగు వేయలేదు. ఇంతటి సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి, విమర్శలు చేయడం సమంజసం కాదు." ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం కావాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం గుర్తుచేశారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు ?5,000 కోట్లు దాటలేదని, ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇళ్ల నిర్మాణం ఎంత వేగంగా జరిగితే, అంత త్వరగా నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు.

# రాష్ట్రం లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కొరత లేదు..

- ఆగిరిపల్లి మండలంలో ఒకే రోజున రూ.7.67 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం.
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారథి ...



**ఏలూరు/ఆగిరిపల్లి,మార్చి 25 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో నిర్మించ బడిన సిసి రోడ్లకు ప్రారంభత్సవం రూ 1 కోటి 50 లక్షలు, శోభనాపురం గ్రామంలో నిర్మించబడిన సిసి రోడ్లు ప్రారంభోత్సవం రూ 1 కోటి 38 లక్షలు, చిన్న అగిరిపల్లి గ్రామంలో రూ 2 లక్షలతో నిర్మించిన వాటరు ప్లాంటు ప్రారంభోత్సవం, చొప్పరమెట్ల గ్రామంలో బిటి రోడ్లు శంకుస్థాపన రూ 1 కోటి 50 లక్షలు, ఈదులుగూడెం గ్రామంలో బిటి రోడ్లు శంకుస్థాపన రూ 2 కోట్ల 10 లక్షలు, ఇదే గ్రామంలో నిర్మించబడిన సిసి రోడ్లు ప్రారంభోత్సవం రూ 24 లక్షలు 35 వేలు, ఇదే గ్రామంలో సిసి రోడ్లు శంకుస్థాపన చేయుట రూ 28 లక్షల 30 వేలు మొత్తం కలిపి రూ 7 కోట్ల 67 లక్షలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి శ్రీకారం చుట్టారు. ప్రజలకు అభివాదాలు చేసుకుంటూ, వారి యోగ క్షేమాలను, గ్రామాలు సమస్యలు అడిగి తెలుసుకుంటూ రూ 7 కోట్ల 67 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామంలో ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టి మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్ధసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్ననప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కొరత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో కుంటుపడిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎన్డీఏ ప్రభుత్వంలో పట్టాలెక్కించి వేగవంతం చేస్తున్నామన్నారు. ఎలక్షన్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఒకేసారి పింఛన్లను పెంపుదల చేసి ఒకటవ తేదీన ఉదయాన్నే ప్రతి ఇంటికి వెళ్లి అందిస్తున్నామని అన్నారు. ల్యాండు టైటిలింగు రద్దు చేసి ప్రజలు ఆస్తికి భద్రత కల్పించామని, అన్నాక్యాంటీన్ల ద్వారా నిరుపేదలకు కేవలం 15 రూపాయలకే మూడు పూటలూ భోజనం పెడుతున్నామన్నారు. నిరుపేదలు ఎవ్వరూ ఆకలితో అలమట్టించకూడదన్నది ప్రభుత్వ ఆలోచన,ఆశయం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక హెక్టరుకు ఇన్పుట్ సబ్సిడీ రూ 25 వేల రూపాయలకు పెంచామని అన్నారు. గత ప్రభుత్వం ఒక్క డిఎస్సీ గాని ఒక ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేక పోయిందని, మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం ద్వారా 16,434 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నారని వీరికి తోడుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహాయ సహకారాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నవమికి ముందే రాములోరికి గిరి ప్రదక్షిణ సుమమాల

- రామతీర్థంలో నాటి వేదన బాధ.. నేడు అభివృద్ధి జాడతో తీరింది
- రూ.3.40 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం
- ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రూ.40 కోట్లతో 22 ప్రధాన ఆలయాలకు రోడ్డు వసతి కల్పించాం
- శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ మార్గాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాం
- కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్డు మంజూరు చేశాం
- ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి,మార్చి 25 (వార్తాప్రభ) :** ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరి రక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆలయాల పవిత్రతను కాపాడటంతోపాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తా మని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లా నెలిమర్ల నియోజకవర్గంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గాన్ని బుధ వారం వర్చువల్ గా పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. సీతారాముని పేట కూడలి నుంచి నీలాచలం కొండ వరకు రూ.3.40 కోట్ల ఉపాధి హామీ నిధులతో 3.70 కిలోమీటర్ల మేర ఈ రహదారిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి ,వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ , పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యులు లోకం మాధవి , పూసపాటి అదితి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "భారతదేశంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో రామతీర్థం ఒకటి. ఈ క్షేత్రంలో రామాయణ, మహా భారత కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి. అంతటి పవిత్రత కలిగిన రామతీర్థం కొండ చుట్టూ భక్తితో ప్రదక్షిణ చేస్తే ముక్తిని పొందుతారన్నది భక్తుల నమ్మిక. అందుకే వైకుంఠ ఏకాదశి, శివరాత్రి పర్వదినాల్లో బోదికొండగా పిలుచుకునే రామతీర్థం గిరి చుట్టూ వేలాది మంది భక్తులు ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకుంటారు.

**రాళ్లు, ముళ్ల కంపలతో భక్తులు ఇబ్బందిపడేవారు..** రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం గతంలో రాళ్లు, రప్పలు, ముళ్ల కంపలతో నిండి ఉండేది. గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులు కష్టమైనా ఆ మార్గంలోనే నడిచేవారు. ఈ విషయాన్ని స్థానిక శాసన సభ్యురాలు లోకం మాధవి తోపాటు కొందరు భక్తులు నా దృష్టికి తీసుకువచ్చారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆలయాల పవిత్రతను సంరక్షించే చర్యల్లో భాగంగా రామతీర్థం కొండ చుట్టూ రోడ్డు నిర్మించే బాధ్యతను భుజాన వేసుకున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ. 3.40 కోట్లు వెచ్చించి గిరిప్రదక్షిణ మార్గంలో బీటీ రోడ్డు నిర్మించాం. అధికారుల సహకారంతో శ్రీరామ నవమికి రెండు రోజుల ముందే రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం.

**20 నెలల్లో రూ. 40 కోట్లు వెచ్చించాం..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాల పవిత్రతను కాపాడే చర్యల్లో భాగంగా గడచిన 20 నెలల కాలంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, సాస్కి నిధులు రూ. 40 కోట్లకు పైగా వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా 22 ప్రధాన ఆలయాలకు రోడ్ల సౌకర్యం కల్పించాం. శివరాత్రికి ముందు శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చాం. కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్డు మంజూరు చేశాం. ఈ రోజున రాములవారి భక్తుల కోసం రామతీర్థం గిరిప్రదక్షిణ రోడ్డుని అందుబాటులోకి తెచ్చాం.

# బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి

## -రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,మార్చి 25 (వార్తాప్రభ) :** బీసీ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మరో రెండు నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని, ఈలోగా హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణాలు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. మరో రెండు నెలల తరవాత నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు చేరే నాటికి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. హాస్టళ్లలోకి దోమలు రాకుండా దోమల నెట్ లు కిటికీలు, ద్వారాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. పరిశుద్ధమైన తాగునీరు అందించడంలో భాగంగా గడువులోగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. బీసీ హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పాటు చేయబోయే 10 ఎంజేపీ స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరానికి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలనన్నారు.

# రానున్నమూడు నెలలు అధిక ఉష్ణోగ్రత, వడగాల్పులు

- ఎండతీవ్రత పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రజలకు ఎండ తీవ్రత సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు
- జి.జయలక్ష్మి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



**అమరావతి,మార్చి 25 (వార్తాప్రభ) :** రానున్నమూడు నెలలు అధిక ఉష్ణోగ్రత, వడగాల్పుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వడగాల్పుల నుండి ఉపశమనం పొందేందుకు అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి సూచించారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రానున్న రోజుల్లో సంభవించే వడగాల్పుల సన్నద్ధతపై ఆర్టీజీఎస్ నుండి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా స్పెషల్ సిఎస్ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 40 నుండి 42 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఎండ తీవ్రత, వడగాల్పుల నుండి కాపాడుకునేందుకు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజల్లో తగిన అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సహా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధి కూలీలు ఉదయం 11 లోపు పనిముగించాలని, పనిచేసే చోట్ల తాగునీరు, మజ్జిగ, టెంట్లు,ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అదే విధంగా ప్రస్తుతం విద్యార్ధులకు పరీక్షలు జరుగున్నందున ఆయా పరీక్షా కేంద్రాల వద్ద తగిన తాగునీరు,ఇతర సౌకర్యాలను కల్పించాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ట్రాన్సుకో అధికారులను జయలక్ష్మి ఆదేశించారు. ఆర్ డబ్ల్యూఎస్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, జలవనరుల శాఖ సమన్వయంతో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఎండల వల్ల పశువులకు ముప్పు కలగకుండా గ్రామాల్లోని నీటి తొట్టెలను ట్యాంకర్లతో నిరంతరం నింపాలని, పశు గ్రాసం విషయంలో రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని పశుసంవర్థక శాఖ అధికారులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య, విద్య, పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి,రక్షిత మంచినీటి సరఫరా, కార్మిక, వ్యవసాయ, విద్యుత్, స్వర్ణ గ్రామ-వార్డు సచివాలయాల, నీటిపారుదల, ఫిషరీస్ తదితర విభాగాలు యాక్షన్ ప్లాన్ ప్రకారం అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను తీసుకుని ప్రజలను పూర్తి అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

## తిరువూరు నియోజకవర్గంలో బెల్ట్ షాపులపై ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు ఆగ్రహం



**తిరువూరు,మార్చి 25 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వహణ కొనసాగుతోందని, వైన్స్ షాపుల యాజమాన్యం సిండికేట్‌గా ఏర్పడి గ్రామాల్లో అక్రమంగా బెల్ట్ షాపులునడుపుతున్నారని తిరువూరు శాసనసభ్యులు కొలకపూడి శ్రీనివాసరావు తీవ్రంగా స్పందించారు. బెల్ట్ షాపులు నడుపుతూ ఎమ్మార్పీ కంటే లిక్కర్ బాటిల్ పై 20 నుంచి 30 రూపాయల వరకు అధికంగా వసూలు చేస్తున్నారని, గ్రామాల్లో బెల్ట్ షాపులు నడిపేవారు క్వార్టర్ బాటిల్ పై అదనంగా 50 రూపాయలు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను దోచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఎక్సైజ్ శాఖ అధికారులు లిక్కర్ సిండికేట్‌తో కుమ్మక్కై సీఎం ఆదేశాలను బేకాతర్ చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. బెల్ట్ షాపుల కారణంగా తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని గ్రామీణ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, ఇప్పటికైనా గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను తొలగించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితర సంబంధిత శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## తిరువూరులో పెట్రోల్ బంకుల దగ్గర భారీగా క్యూ..



**తిరువూరు,మార్చి 25 (వార్తాప్రభ) :** పట్టణంలో ఉన్న 4 ట్రోల్ బంకుల్లో ఫ్యూయల్ లేని కారణంగా మూడు క్లోజ్..ఉన్న ఒక రిలయన్స్ బంక్ ముందర భారీగా క్యూకట్టిన వాహనదారులు..పెట్రోల్ బంకులు మూసివేస్తారన్న వదంతులతో ఆందోళన చెందుతున్న జనం..ఆయిల్ కంపెనీలు క్రెడిట్ ఇవ్వడం మానేయడంతో మూతబడ్డ పలు పెట్రోల్ బంకులు..

## ప్రజా ప్రతినిధుల సేవలు మరువలేనివి మహోన్నతమైనవి - ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,మార్చి 25 (వార్తాప్రభ) :** ప్రజల కోసం ప్రజల చేత ప్రజలే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు వార్డు మెంబర్లకు గ్రామ సర్పంచులు గా నూతనంగా రాజకీయాలలో అడుగుపెట్టిన యువ నాయకులు సుదీర్ఘకాలం ప్రజా సేవలో అనుభవం కలిగిన సీనియర్ రాజకీయ మేధావులు కూడా సేవలు అందించారని వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని ఎంపీడీవో చిన్న రాట్నాలు తెలియజేశారు. రెండవ తేదీ నాటికి వార్డ్ మెంబర్లగా సర్పంచులుగా పదవీకాలం ముగియనుండటంతో మాజీలు కనుగొన్నారని అన్నీ కలిసి వస్తే రాబోయే కాలంలో వారే ఎంపీటీసీలుగా సర్పంచులుగా ఎంపీపీ మరియు జెడ్పిటిసిలుగా ప్రజా న్యాయస్థానంలో వారి ఆశీస్సులతో గెలుపొంది సంవత్సరాలు సేవలందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఐదు సంవత్సరాల కాలం అటు ప్రజలకు ఇటువంటి అధికారులకు వారదులుగా ప్రజలకు సేవలు అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని వారి సేవలు మరపురానివి మధురమైనవి మరువలేనివి మహోన్నతమైన వని ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు శివకుమార్ రామ్మోహన్ లు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత వల్ల ట్రాక్టర్ల తో కట్టెల తరలింపు





**పెనుగంచిప్రోలు, మార్చి 25 (వార్తాప్రభ) :** దేశ వ్యాప్త గ్యాస్ కొరత సెగ పెనుగంచిప్రోలు ప్రాంతం లో స్పష్టం గా కనిపిస్తుంది. సిలిండర్ బుకింగ్ కు రోజులు సమయం పడుతుండటం తో గ్యాస్ దొరకదన్న అందోళనలో ప్రజలు ప్రత్యామ్నయ మార్గాలను వెతు కుంటున్నారు.పొలల్లో ఎండిపోయిన పత్తి,మిర్చి, సుభాబుల కట్టెలను పోగు చేసుకొన్ని ట్రాక్టర్ల లో తెచ్చుకొన్ని పాత పద్ధతి లో కట్టెల పోయిపైనే వంటలు వండు కుంటూ కాలం వెళ్ళదిస్తున్నారు.కాని పెనుగంచిప్రోలు లో గృహాలకు వాడే గ్యాస్ సిలిండర్ ఒకటి 1800 వందలు చొప్పున బ్లాక్ లో కొనుకుంటున్నారు. కొంతమంది ఆ సిలిండర్లు వారికి ఎక్కడ నుండి వస్తున్నాయి.. గ్యాస్ కంపెని అధికారులు, ప్రభుత్వ అధికారులు ఎక్కడికి పోయారు...?, సామాన్యులు గ్యాస్ బుక్ చేసిన రెండు రోజు లకు కూడ డెలివరీ లేదు. అడిగితే బుక్ చేసిన ఆరు రోజులకు డెలివరీ అంటున్నారు. గ్యాస్ సరఫరా చేసే డెలివరీ బోయ్స్, అధికారుల ప్రకటనలు ఒక రకంగా ఉంటాయి. అమలాల్లో ఉండవు అంటున్నారు ప్రజలు..

## చిన నందిగామ గ్రామం ఆయకట్టు రైతుల సమస్య ను పరిష్కరించండి

● సమస్యను ఏపీఎస్ఐడిసి చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ దృష్టికి తీసుకువెళ్లిన ఇందిరా ప్రియదర్శిని





**విజయవాడ,మార్చి 25 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలం పరిధిలోని చిన నందిగామ గ్రామం లోని సుమారు 1000 ఎకరాల ఆయకట్టు రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఇరిగేషన్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని ఆ కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ ను కోరారు.విజయవాడ లోని ఇరిగేషన్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయం లో కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ ఆధ్యక్షతన బుధవారం ఏపీఎస్ఐడిసి బోర్డ్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు, ప్రభుత్వ అధికారులు, డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని సహచర డైరెక్టర్ల తో కలిసి పాల్గొన్నారు. చిన నందిగామ గ్రామ పరిధిలో 1000 ఎకరాల ఆయకట్టు కు కావలసిన నూతన పంప్ హౌస్ గురించి అంకెం ఇందిరా ప్రియదర్శిని సమావేశంలో చైర్మన్ లీలా కృష్ణ కి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మేనేజింగ్ డైరెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరువు ప్రెసిడెంట్, సెక్రటరీ డైరెక్టర్ లు పాల్గొన్నారు.

## యువతకు 20 లక్షలు ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● అర్హులందరికీ ఆ స్థలాల్లో ఇళ్ల పట్టాలు ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



**కాకినాడ,మార్చి 25 (వార్తాప్రభ) :** యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఇప్పటికే 20 నెలల్లోనే ఆరు లక్షల 28 వేల 347 ఉద్యోగాలను యువతకి అందించినట్లు టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ వెల్లడించారు. వీటితోపాటు 23 లక్షల కోట్లు పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. ఉగాది సందర్భంగా యువతకు భారీగా ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టిందని అందులో భాగంగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి విద్య, పోలీస్ శాఖలకు పెద్దపీట వేసినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహించి భారీగా టీచర్ పోస్టులు భర్తీ చేసి మరోసారి డీఎస్సీని జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం మూడు వేల ఖాళీలను భర్తీ చేసిందన్నారు. జాబ్ క్యాలెండర్ అంటే ఒక ప్రకటన మాత్రమే కాదని అది నిరుద్యోగులకు ఉద్యోగ భరోసా అని చెప్పారు. జగ్గంపేటలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను టీడీపీ నేతలు కబ్జా చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే తోట నరసింహం చేసిన వ్యాఖ్యలపై నవీన్ స్పందించారు. ప్రభుత్వం 2011లో పేదలకు ఇచ్చిన పట్టాలను రద్దు చేసిందని అందులో కేవలం పది మంది లోపు మాత్రమే అర్హులు ఉన్నారని వారితో పాటు ఇంకా అరులైన వారందరికీ తాము త్వరలోనే ఇళ్లపట్టాలిస్తామని చెప్పారు. అలాగే అక్కడ వైసీపీకి చెందినవారు రియల్ ఎస్టేట్ మాఫియాగా ఏర్పడి సుమారు రెండు ఎకరాల భూమిని కబ్జా చేసి తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని, అనర్హులకు మాత్రం స్థలాలు ఇవ్వమని ఖరాకండీగా చెప్పారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే తోట నరసింహం అనవసర రాద్ధాంతం చేయడం తగదన్నారు. అర్హులకు పట్టాలు ఇవ్వని పక్షంలో నరసింహం స్వయంగా వారి వివరాలు వెల్లడిస్తే వారికి ఇచ్చేందుకు వెనుకాడబోనని నవీన్ తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పెంకే శ్రీనివాస బాబా, రామదేవు సీతయ్య దొర, కోర్పు సాయి తేజ తదితరులు పాల్గొన్నారు

## రైతులే రారాజులు లక్ష్యంగా సంపన్న కర్రి ప్రోగ్రాం



**విస్సన్నపేట,మార్చి 25 (వార్తాప్రభ) :** స్థానిక మండల వెలుగు కార్యాలయంలో రైతులను రారాజులను చేసేలక్ష్యంగా డిజిటల్ రైతు బజార్ నందు విప్లవాత్మకమైన మార్పులను కూటమి ప్రభుత్వం తీసుకువచ్చినట్లు రైతులకు మామిడి రైతుల సదస్సు కార్యక్రమం లో భాగంగా అధికారులు తెలియజేశారు. ఎండనకా వాడనక రేయనక పగలనక చలి అనక రైతన్నలు కష్టపడితేనే ఈ దేశంలో ప్రతి ఒక్కరి కడుపునిండుతుందని ఆ రైతు పండించే పంటకు ఆహార భద్రత కల్పించే లక్ష్యంగా మన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవాత్మకమైన తొలి అడుగుకు శ్రీకరశీ డిజిటల్ రైతుబజార్ ఆన్లైన్ డోర్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. రైతు పండించిన పంటలకు సరైన ధరలు వచ్చే విధంగా దళారీ వ్యవస్థ లేకుండా రైతు బజారు ధరలకే వినియోగదారు లకు ఆన్లైన్ విక్రయాల ద్వారా మన్నికైన మేలి రకం ఫ్రెష్ కాయగూరలు పండ్లు పువ్వులు నేరుగా గడప వద్దకే అందించేందుకు డిజి రైతు బజార్ యాప్ ను ప్రారంభించినట్లు వారు తెలియజేశారు. వినియోగదారులకు తాజా ఉత్పత్తులు రైతులకు మంచి గుర్తింపు మరియు దళారి వ్యవస్థ లేని ఆర్థిక భరోసా మరియు బలోపేతం చేసే ప్రభుత్వ లక్ష్యం ప్రతి ఇంటికి ఆరోగ్యకరమైన పండ్లు కాయలు పువ్వులు అందించే ప్రభుత్వ లక్ష్యాలకు డిజి రైతు బజార్ యాప్ డాట్ కామ్ వెబ్సైట్ పరమపద సోపానం కానున్నదని వారు తెలియజేశారు. మన గ్రామంలో పండిన పంట అదే రోజు పట్టణాలకు సైతం అదే రోజు డోర్ డెలివరీ అయ్యే సౌలభ్యాన్ని డిజిటల్ సాంకేతికత ద్వారా అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిజి రైతు బజార్ పిడిలు కళ్యాణ్ చక్రవర్తి,సురేష్ లు, ఆపరేషన్ డైరెక్టర్ ఎన్ రామ్ బిజినెస్ మేనేజర్ సురేంద్ర ఏపిఎం జమలయ్య సిసి లు రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలకు గ్రీన్ రేటింగ్‌పై శ్రీసిటీలో అవగాహన సదస్సు




**తిరుపతి,మార్చి 25 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని పరిశ్రమలలో సుస్థిర విధానాలు, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలను ప్రోత్సహిస్తూ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి , భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా బుధవారం 'గ్రీన్ రేటింగ్' అవగాహన సదస్సును శ్రీసిటీలో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైర్మన్ డా. పి.కృష్ణయ్య, ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమల కోసం 'గ్రీన్ రేటింగ్' విధానాన్ని అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. సదస్సులో పరిశ్రమల ప్రముఖులు, విధాన నిర్ణేతలు, సుస్థిరతా నిపుణులు పాల్గొని పారిశ్రామిక వృద్ధిలో పర్యావరణ భాధ్యత యొక్క ఆవశ్యకతను హైలైట్ చేశారు.పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి డా. కృష్ణయ్య మాట్లాడుతూ, పరిశ్రమల అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ కూడా భాగం కావాలని, దీని కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం లక్ష్యాన్ని, తీరప్రాంతంలో ప్రతిపాదించిన 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రణాళికను ప్రస్తావించిన ఆయన, పరిశ్రమలు స్థానికంగా పెరిగే చెట్లను నాటడం మరియు ఇతర హరిత కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. శ్రీసిటీలో గ్రీన్ రేటింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు డా. కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సుస్థిరత అనేది శ్రీసిటీ పయనంలో అంతర్భాగం అని పేర్కొన్నారు. హరిత భవనాలు, పునరుత్పాదక శక్తి వినియోగం, సమర్థవంతమైన నీటి మరియు వ్యర్థాల నిర్వహణ, ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన ప్రోత్సాహక వ్యవస్థతో తమ పరిశ్రమలు క్రమ ంగా ప్రపంచ స్థాయి హరిత ప్రమాణాలను పాటిస్తున్నాయని చెప్పారు. పర్యావరణ బాధ్యతతో దీనిని మరింత ముందుకు తీసుకువెళతామని స్పష్టం చేశారు.సీఐఐ గ్రీన్‌కో దక్షిణ ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ ఛైర్మన్ నిహాల్ కౌల్ మాట్లాడుతూ, ఇంధన శక్తి, నీరు, వ్యర్థాల వినియోగాన్ని క్రమబద్ధం చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు కంపెనీకి లాభాలు కూడా సాధ్యమవుతాయని చెప్పారు. పరిశ్రమలు పర్యావరణ హిత సుస్థిర అభివృద్ధి దృక్పథాన్ని ముందుకు తీసుకెళ్లడంలో గ్రీన్‌కో మరియు ఐజీబీసీ రేటింగ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఈ ప్రక్రియలో శ్రీసిటీ దీనికి ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎన్.ముత్తుసెళియన్ స్వాగత ఉపన్యాసంలో, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి , భారత పరిశ్రమల సమాఖ్య సహకారం ద్వారా పరిశ్రమలకు గ్రీన్‌కో, ఐజీబీసీ రేటింగ్స్ వంటి ఫ్రేమ్‌వర్క్‌లు అందుతు న్నాయన్నారు. ఇవి ఇంధన శక్తి, నీరు, వ్యర్థాలు మరియు సరఫరా గొలుసు నిర్వహణలలో స్థిరత్వాన్ని సాధించడానికి సహాయపడతాయని వివరించారు.పరస్పర చర్చల సందర్భంగా పరిశ్రమల ప్రతినిధుల ప్రశ్నలకు స్పందిస్తూ శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో సమగ్ర వ్యర్థాల నిర్వహణ మరియు ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ సదుపాయాలు త్వరలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని డా. కృష్ణయ్య హామీ ఇచ్చారు. శ్రీసిటీ వేదికగా సుస్థిరత ప్రమాణాలు పాటించడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి తోడ్పాటు అందించే దిశగా పరిశ్రమల సానుకూల స్పందనతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఘనంగా ప్రత్తిపాడు తూలగిరి శ్రీ సీతారాముల విగ్రహ ఆవిష్కరణ




**కాకినాడ,మార్చి 25 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో తూలగిరి శ్రీ సీతారాముల విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. పరమహంస పరివ్రాజకులు త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి వారి స్వీయ పర్యవేక్షణలో తూలగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో వేలాది రాములోరి భక్తులందరూ ఈ పుణ్య కార్యక్రమంలో పాల్గొని భక్తి పారవశ్యంలో పరవశించారు. శ్రీ పరాశర రఘునాధ భట్టర్ స్వామి వారు ఆగమ శాస్త్ర విధానంలో ఈ విగ్రహ ప్రతిష్టాపన జరిగింది.చిన జీయర్ స్వామి ప్రవచనాలు ,ఆశీర్వచనంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ఆలయం ఆంధ్రకు మరో భద్రాద్రిగా వెలసిల్లుతుందని ఆయన అన్నారు. ఆలయ కమిటీ ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ విగ్రహ ఆవిష్కరణ జరిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, డీసీబీసీ సభ్యుడు న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు, కాకినాడ మెయిన్ రోడ్డు సీతారామ స్వామి ఆలయం పాలక మండలి డైరెక్టర్ తురగా సూర్యారావు, జీయర్ స్వామి ఆశీస్సులు పొందారు. న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఆలయ విగ్రహావిష్కరణలో పాల్గొనడం జియర్ స్వామి ఆశీర్వచనాలు పొందడం పూర్వజన్మ సుకృతంగా శ్రీరామచంద్రుని అనుగ్రహంగా భావిస్తున్నానని తెలిపారు.అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదు: కమిషనర్ సత్యనారాయణ



**కాకినాడ,మార్చి 25 (వార్తాప్రభ) :** కాకినాడ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం సహించబోమని నగర పాలక సంస్థ కమీషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ హెచ్చరించారు. నగరంలోని ఏటిమొగ ప్రాంతంలో ఆయన విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రతిరోజూ శానిటేషన్ వర్కర్లు వస్తున్నారా, కాలువలను సక్రమంగా శుభ్రం చేస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను కూడా అడిగి తెలుసుకుంటూ, పారిశుద్ధ్యంపై వారి అభిప్రాయాలను సేకరించారు. ఏటిమొగ ప్రాంతంలో దోమలు అధికంగా ఉన్నాయని స్థానికులు కమీషనర్ దృష్టికి తీసుకురాగా, ఫాగింగ్ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అన్నమ్మఘాటి సెంటర్‌లోని అన్న క్యాంటిన్‌ను సందర్శించిన కమీషనర్, అక్కడి నిర్వహణపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటిన్ సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ, ఏటిమొగ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించామని, శానిటేషన్ నిర్వహణలో ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరాన్ని శుభ్రంగా ఉంచడం కోసం అధికారులు,సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వెంట శానిటేషన్ ఇన్స్పెక్టర్ ధర్మాజీ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 29న అండర్ 19 బాయ్స్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

● సిడిసిఏ అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాసమూర్తి, సతీష్ యాదవ్



**తిరుపతి,మార్చి 25 (వార్తాప్రభ) :** ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్(సిడిసిఏ) ఆధ్వర్యంలో మార్చి 29వ తేదీ ఆదివారం అండర్ 19 బాయ్స్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు సిడిసిఏ అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి సతీష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రికెట్ సెలక్షన్స్ తిరుపతి స్థానిక మంగళం రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా ఉన్న సీవీ క్రికెట్ అకాడమీ నందు ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సెలక్షన్స్ లో హాజరగు క్రీడాకారులు అండర్ 19 బాయ్స్ 1.9.2007 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈనెల 29వ తేదీ ఆదివారం జరిగే ఈ సెలక్షన్స్ లో పాల్గొనే క్రికెట్ క్రీడాకారులు తెల్లని దుస్తులు, తమ సొంత క్రీడా సామాగ్రితో పాటు ఆధార్ కార్డు, జన్మ ధ్రువీకరణ పత్రము తప్పక తీసుకురావాలని సూచించారు. కావున క్రికెట్ పై ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ క్రికెట్ సెలక్షన్స్ ను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సతీష్ యాదవ్ 88861855559, కోచ్ సునీల్ కుమార్ 9000214966, కోచ్ చిన్నబాబు 798188 0381 లను చరవాణి ద్వారా సంప్రదించవలసిందిగా వారు కోరారు.

## ప్రారంభమైన అంగన్వాడీల్లో ఒంటిపూట బడులు



**పెనుగంచిప్రోలు,మార్చి 25 (వార్తాప్రభ) :** వేసవి తీవ్రత నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం నుంచి ఒంటిపూట బడిని అమలు చేయాలని నిర్ణయించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కేంద్రాలు కొనసాగనున్నాయి. పని వేళలు మారినప్పటికీ లబ్ధిదారులకు అందే పోషకాహార పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. టేక్ హోం రేషన్ విధానం పక్కాగా అమలు కావాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం తదుపరి నిర్ణయం వరకు కేంద్రాలకు ఒంటి పూట బడి విధానం కొనసాగనుంది.

## కడలి ఒడిలోకి ఆలివ్ రిడ్లే తాబేళ్ళ పిల్లలు



**కోడూరు, మార్చి 25 (వార్తాప్రభ) :** అరుదైన ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను బుధవారం పాలకాయతిప్ప వద్ద కడలి ఒడిలోకి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ వదిలిపెట్టారు. పాలకాయ తిప్ప బీచ్ వద్ద అటవీ శాఖ వారి సంరక్షణలో గల తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రం వద్ద ఉత్పత్తి అయిన ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను అటవీ శాఖ ఏలూరు డివిజన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే సముద్రుణి చెంతకు చేర్చారు.

## 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మార్చి 25 (వార్తాప్రభ) :** ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది.

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,మార్చి 25: (వార్తాప్రభ):**మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కోదండ రామచంద్రమూర్తి వారి దివ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవము కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అయ్యప్ప సొసైటీ వాసులు మధుసూదన్ రెడ్డి,రావు,వాసు, పరమేశ్వర్,కాలనీ వాసులు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమముగా తరలిస్తున్న 31 గ్యాస్ సిలిండర్లు ఉన్న వ్యాన్ స్వాధీనం

**అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్ పాల్పడితే కఠిన చర్యలు మాదాపూర్ పోలీసుల హెచ్చరిక.**



**శేరిలింగంపల్లి,మార్చి 25 (వార్తాప్రభ):**మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పత్రిక నగర్‌లో అక్రమంగా తరలిస్తున్న 31 గ్యాస్ సిలిండర్లతో కూడిన వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు.మాదాపూర్ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం,అక్రమంగా సిలిండర్లు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా 31 సిలిండర్లతో ఉన్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు.అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.గ్యాస్ సిలిండర్లను అక్రమంగా విక్రయించే ప్రయత్నాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## బిజెపి రాష్ట్ర నాయకులు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కూకట్ పల్లి,మార్చి 25(వార్తాప్రభ)**:వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో బుధవారం సీనియర్ సిటిజన్ పార్క్ వద్ద భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం మెడికవర్ హాస్పిటల్ వైద్య శిబిరానికి 200 మంది పైగా ప్రజలు ఉచిత బిపి,షుగర్,ఈసీజీ, డెంటల్,డాక్టర్ పర్యవేక్షణ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డేవిడ్ సీనియర్ మార్కెట్ ఎగ్జిక్యూటివ్, ప్రశాంత్ కుమార్ మెడికవర్,రమేష్,రాజు యాదవ్, త్రినాధ్ కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జీవితపు టైమ్ టేబుల్!!




ఉదయపు కిరణంతో మొదలవుతుంది ఒక కొత్త పాఠం,
సమయం రాసిన సిలబస్ ప్రకారం సాగే ఓ ప్రయాణం.
బాల్యం అంటే ఆటపాటల విరామ సమయం,
ఏ కల్మషం తెలియని స్వచ్ఛమైన అమాయకత్వం!!
యవ్వనం అంటే శ్రమించాల్సిన అసలైన క్లాసు,
లక్ష్యాల వేటలో అలసిపోని నిరంతర తపస్సు.
గడియారం ముల్లు ఆగకుండా పరుగు తీస్తుంటే,
బాధ్యతల మోత గుండె చప్పుడును పెంచుతుంటే..!!
ప్రేమ, స్నేహం, బంధాలు అన్నీ అదనపు సబ్జెక్టులే,
సంతోషాలు, కన్నీళ్లు మనకు లభించే గ్రేడులే.
కాలం మాస్టారు వేసే ప్రశ్నలకు జవాబులు దొరకవు,
అనుభవమే అసలైన పాఠమని అప్పటికిగానీ తెలియదు.!!
ముసలితనం అంటే ఈ పరీక్షలన్నీ ముగిసిన సమయం,
గడిచిన జ్ఞాపకాల పుటలను తిరగేసే ఏకాంతం.
మనం సంపాదించింది ఏమిటో తేల్చేది చిట్టచివరి రోజు
పలుగురికి పంచిన ప్రేమే మన అసలైన గెలుపు ఈ రోజు!!
సమయం ఎవరికోసం ఆగదు, వెనక్కి అస్సలు రాదు,
పరుగెత్తే ఈ టైమ్ టేబుల్‌ను ఎవరూ మార్చలేరు.
ప్రతి క్షణాన్ని ఆస్వాదించు, ప్రేమని పంచుతూ సాగిపో,
జీవితం అనే ఈ క్లాసులో నువ్వే టాపర్‌గా నిలిచిపో!!

**గడ్డం సంతోష్ రాజ్**
గోదావరిఖని

# కౌన్సిల్‌లో "సూర్య" ప్రతాపం!!

● ప్రజా సమస్యల చిట్టా విప్పిన సీపీఐ కార్పొరేటర్ ● రూపాయి అంత్యక్రియల్లో డప్పు మోగాల్సిందే ● వేతనాల జాప్యంపై ఆగ్రహం ● నగర పాలనపై పలు సూచనలు



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 25 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నగరపాలక సంస్థ ప్రథమ కౌన్సిల్ సమావేశం వేదికగా సిపిఐ ఫ్లోర్ లీడర్, 41వ డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య ప్రజా సమస్యలపై నిప్పులు చెరిగారు. ముఖ్యంగా తన డివిజన్ పరిధిలోని నాలాల పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే శానిటేషన్ విభాగాన్ని అప్రమత్తం చేయాలని, అస్తవ్యస్తంగా మారిన యూజీడీ వ్యవస్థకు మరమ్మత్తులు చేపట్టాలని మేయర్ సాక్షిగా అధికారులను గట్టిగా డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని ప్రశ్నిస్తూ, వందల కోట్ల అభివృద్ధి నిధులు ఉన్నాయని చెబుతున్న పాలకవర్గం కార్మికుల పొట్ట కొట్టడం శోచనీయమని, ట్రాన్స్ఫర్ డ్యూటీ నిధులను దారి మళ్లించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచే ఒక్క రూపాయి అంత్యక్రియల పథకాన్ని తక్షణమే ప్రారంభించి, అందులో డప్పు కళాకారుల సేవలను చేర్చడంతో పాటు వైకుంఠ రథాలను అందుబాటులోకి తేవాలని సూచించారు. గత నాలుగు నెలలుగా జీతాలు లేకున్నా సేవలందిస్తున్న ఆరుగురు ఈఈఎస్ఎల్ ఎలక్ట్రీషియన్లను మానవతా దృక్పథంతో కొనసాగించాలని కోరగా, మేయర్ సానుకూలంగా స్పందించి కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ప్రజలను వణికిస్తున్న కుక్కల బెడదపై కఠిన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, గత పాలకవర్గంలో జరిగిన వాహనాల గోల్మాల్ పునరావృతం కాకుండా పాత వాహనాల స్థితిగతులపై అంచనా కమిటీ వేసి వాటిని వినియోగంలోకి తేవాలని కోరారు. చివరగా కార్పొరేషన్ ఆదాయ వనరులను పెంచుకోవడానికి 1998–2004 తర్వాత నిలిచిపోయిన ఇంటి పన్నుల రీ-అసెస్మెంట్ ప్రక్రియను చేపట్టాలని, మేకల మండి వంటి వ్యాపార కేంద్రాలను మున్సిపల్ తై బజార్ పరిధిలోకి తీసుకువచ్చి ఆర్థిక పరిపుష్టి సాధించాలని మేయర్‌కు విలువైన సూచనలు చేశారు.

# రామగుండం బడ్జెట్ ధమాకా!!

● అభివృద్ధి పనులకు రూ. 248 కోట్ల వరాల జల్లు ● నగర వికాసానికి ఆర్థిక ఊతం ● ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా ఆదాయ, వ్యయాల అంచనా ● సాధారణ నిధుల నుంచి డిపాజిట్ల వరకు.. ప్రతి రూపాయి నగర ప్రగతికే ● మార్చి 2027 నాటికి మిగులు బడ్జెట్ దిశగా పక్కా ప్లానింగ్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 25 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన భారీ బడ్జెట్‌ను మేయర్ మహంకాళి స్వామి అధ్యక్షతన ప్రవేశపెట్టగా, మెజారిటీ సభ్యుల మద్దతుతో దీనికి ఏకగ్రీవ ఆమోదం లభించింది. ఈ బడ్జెట్ అంచనాలను పరిశీలిస్తే, 2026–27 సంవత్సరానికి గానూ మొత్తం ఆదాయం, వ్యయాలను సమానంగా రూ. 24,866.51 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో ప్రధానంగా 15వ ఆర్థిక సంఘం నుండి రూ. 16,941.16 లక్షల భారీ నిధులు రానున్నట్లు అంచనా వేయగా, సాధారణ నిధుల ద్వారా రూ. 4,546.60 లక్షలు, డిపాజిట్లు, అడ్వాన్స్‌ల రూపంలో రూ. 570.00 లక్షల ఆదాయం సమకూరనుంది. గత ఏడాది నిల్వ ఉన్న రూ. 2,808.75 లక్షలతో కలిపి నగర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. వ్యయాల పరంగా కూడా అంతే మొత్తాన్ని కేటాయిస్తూ, ముఖ్యంగా పదిహేనవ ఆర్థిక సంఘం నిధులను మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధి పనులకు వెచ్చించనున్నట్లు మేయర్ సభలో వివరించారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలపై జరిగిన చర్చలో మెజారిటీ కార్పొరేటర్లు సానుకూలంగా స్పందించి ఆమోదం తెలపడంతో, నగరపాలక సంస్థ పాలకవర్గం హర్షం వ్యక్తం చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభ నిల్వ రూ. 2,808.75 లక్షలు ఉండగా, సాధారణ నిధుల ఆదాయం రూ. 3,866.90 లక్షలతో కలిపి మొత్తం రూ. 6,675.65 లక్షల బడ్జెట్ నిర్వహించబడింది. రాబోయే 2026–27 సంవత్సరంలో ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని రామగుండం నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని మేయర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నగర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బడ్జెట్ పారదర్శకంగా ఉందని, విద్య, వైద్యం, పారిశుధ్యానికి పెద్దపీట వేస్తామని సభ్యులు అభిప్రాయపడ్డారు. చివరగా మార్చి 31, 2027 నాటికి కూడా రూ. 2,808.75 లక్షల నిల్వ ఉంటుందని అంచనా వేస్తూ, మొత్తంగా రూ. 248.66 కోట్ల బడ్జెట్‌కు మున్సిపల్ కౌన్సిల్ అధికారిక ముద్ర వేసింది.

# ఇందిరమ్మ రాజ్యం!!

● రామగుండంలో 3500 మందికి ఇళ్ల మంజూరు ● రూ. 5 లక్షల ఆర్థిక సాయం ● పేదల సొంతింటి కల సాకారం ● అసెంబ్లీలో గర్జించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 25 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నియోజకవర్గంలో నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఇప్పటికే 3500 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో గంభీరంగా ప్రకటించారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా నియోజకవర్గంలో 400 మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేశామని, వీరు ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపున రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజా ధనాన్ని వృథా చేసిందని, ఆ నిర్మాణాలను నిరుపయోగంగా వదిలేసి పేదలకు అన్యాయం చేసిందని ఆయన ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ, రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా రామగుండం నియోజకవర్గంలో 53 మంది ట్రాన్స్‌జెండర్లకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం గర్వకారణమని, వారికి ఇప్పటికే వివిధ విభాగాల్లో ఉపాధి కల్పించి అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సింగరేణి, జెన్కో భూముల్లో నివసిస్తున్న సుమారు 18,000 మందికి పట్టాలు ఇచ్చామని గుర్తు చేస్తూ, మిగిలిపోయిన మరో 7 వేల మందికి కూడా త్వరలోనే పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి మరో 11 వేల మంది నిరుపేదలను గుర్తించామని, వారికి ఖాళీ స్థలాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి సకల వసతులతో కూడిన ఇందిరమ్మ కాలనీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని, ప్రజా సంక్షేమమే తమ అంతిమ లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అసెంబ్లీ వేదికగా పునరుద్ఘాటించారు. ఈ చర్యల ద్వారా రామగుండం నియోజకవర్గంలో గూడు లేని పేదవాడు ఉండకూడదన్నదే తమ సంకల్పమని, ఇందుకోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజా రంజక పాలన అందిస్తామని ఆయన తెలిపారు.

# ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం.

● ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ.
● మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్.



**జవహర్ నగర్, మార్చి 25:(వార్తా ప్రభ)**ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం లభిస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని దొండ తోట కాలనీ వాస్తవ్యులైన గొడుగు సంధ్య యాకయ్య దంపతులకు ఇటీవలే ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇంటి నిర్మాణం చేపట్టగా సంధ్య యాకయ్యలు ఇటీవల ఇల్లు నిర్మించుకొని నూతన గృహప్రవేశానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు గృహప్రవేశానికి జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీ పథకాలలో భాగంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి జవహర్ నగర్ లో పెద్ద ఎత్తున లబ్ధిదారులు ఎంపిక ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. పేద ప్రజలకు నిలయమైన జవహర్ నగర్ లో ప్రభుత్వ పథకాలను సద్వినియం చేసుకోవడం ముదాభావమన్నారు. తెలంగాణలో ప్రజా పాలనతోనే గరీబోళ్లకు సమన్యాయం జరుగుతుందని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందన్నారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షునితో రిబ్బన్ కట్ చేసే గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బల్లి శ్రీనివాస్ గుప్తా, మాట్ల వినయ్, అరికల అనిల్ ముదిరాజ్, అశోక్ గుప్తా, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## వార్తా ప్రభ

## హైదరాబాద్

## వేగం ప్రాణాంతకం.. నిబంధనలే కవచం!!

● రైల్వే స్టేషన్ వేదికగా రోడ్డు భద్రతా పాఠాలు
● ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం వద్దు...అధిక లోడింగ్పై సీరియస్
● ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం - ప్రాణాలను కాపాడుకుందాం ● మందు కొట్టి బండి తీస్తే.. కటకటాల వెనక్కి పంపడం ఖాయం ● పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 25 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రతి ఒక్కరూ సురక్షిత డ్రైవింగ్ అలవాట్లు అలవరచుకోవాలని, రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల పని మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి. ఈ మేరకు బుధవారం రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా నిర్వహిస్తున్న "అరైవ్ - అలైవ్" ఫేజ్--3 కార్యక్రమంలో భాగంగా రామగుండం రైల్వే స్టేషన్ వద్ద భారీ ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ....... ఆటో డ్రైవర్లు తమ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, అతి వేగం ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేసే సమయంలో మొబైల్ ఫోన్లు వాడటం వంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేవారు సీటు బెల్టు ధరించడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, పాదచారులకు గౌరవం ఇవ్వడం నాగరిక సమాజ లక్షణమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్సై సంధ్యారాణి తదితరులు పాల్గొని డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే సామాజిక, ఆర్థిక నష్టాలను వివరించిన అధికారులు, ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రజల ప్రాణాలను రక్షించడమే ఈ "అరైవ్ - అలైవ్" కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని, దీనిని విజయవంతం చేయాలని డీసీపీ కోరారు.

## ఎమ్మెల్యే ని కలిసిన హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు



**కూకట్ పల్లి, మార్చి 25(వార్తాప్రభ):**ఆల్విన్ కాలనీ సర్కిల్ వెంకటేశ్వర్ నగర్ డివిజన్ లోని హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కలిసి తమ కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల,వీధి దీపాల ఏర్పాటు, పార్కు అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు. కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనలో చొరవ చూపాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాలనీ అభివృద్ధికి తమ వంతు మద్దతు ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోటిముక్కల వెంకటేశ్వరరావు, నాయినేని చంద్రకాంత్ రావు, కాలనీవాసులు టీ.నర్సింలు,బాలు యాదవ్,లక్ష్మీనారాయణ,ప్రగతి నగర్ అధ్యక్షులు తిరుపతి రావు, హనుమాన్ నగర్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్,ప్రధాన కార్యదర్శి వెంకట్,కోశాధికారి వీరేష్,సోపన్ రావు శంకర్ సింగ్,పరమేష్ గౌడ్, రాములు,కాసిం, శ్రీకాంత్ యాదవ్, జోగారావు,చంద్రశేఖర్,రవి,డేవిడ్ మోజేష్,పాల్గొన్న రావు,శ్రీశైలం దశరథ్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## బిజెపి నేత వడ్డేపల్లి నీ కలిసిన హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



**కూకట్ పల్లి, మార్చ్25(వార్తాప్రభ):**ఆల్విన్ కాలనీ సర్కిల్ హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నూతనంగా ఎన్నికైన సందర్భంగా బుధవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు నూతన కార్యవర్గ సభ్యులను శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు టీ.నర్సింలు,బాలు యాదవ్, ఏక్నాథ్,హనుమన్ నగర్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకట్, కోశాధికారి వీరేష్,సోపన్ రావు,రాములు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

# ఎడిటోరియల్

## యుద్ధం ముగింపునకు ఇరాన్ ఏడు షరతులు.. అమెరికా అంగీకారం సందేహమే!

మధ్యప్రాచ్యంలో శాంతి చిగురిస్తుందని ఆశించిన ప్రతిసారీ కొత్త చిక్కుముడులు పడటం పరిపాటిగా మారింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఐదు రోజుల యుద్ధ విరామం ఒక చిన్న ఊరటనిస్తుందని భావించినా.. ఇరాన్ తాజాగా తెరపైకి తెచ్చిన 'ఏడు షరతులు' ఆ ఆశలపై నీళ్లు చల్లాయి. యుద్ధం ముగియాలంటే తాము కోరినట్లుగా అంతర్జాతీయ సమీకరణాలు మారాలని ఇరాన్ భీష్మించుకు కూర్చోవడం.. అగ్రరాజ్యాన్ని ఆత్మరక్షణలో పడేసే వ్యూహంగా కనిపిస్తోంది. ఇరాన్ ముందు ఉంచిన డిమాండ్లు అమెరికాకు మింగుడుపడని విధంగా ఉన్నాయి. 1. సైనిక స్థావరాల తరలింపు: గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను వెంటనే మూసివేసి, బలగాలను వెనక్కి తీసుకోవాలి. 2. దాడి చేయబోమని హామీ: భవిష్యత్తులో ఇరాన్ భూభాగంపై ఎలాంటి సైనిక చర్యలు చేపట్టబోమని అమెరికా లిఖితపూర్వక హామీ ఇవ్వాలి. 3. ఇజ్రాయెల్ దాడుల నిలిపివేత: ఇజ్రాయెల్--హిజ్బుల్లా మధ్య జరుగుతున్న ఘర్షణలను తక్షణమే నిలిపివేసేలా అమెరికా ఒత్తిడి చేయాలి. ాశ్రీంశీ =ము౦ - దేశంలో కల్లోలం: మోడీ కామెంట్లే కారణమా? 4. ఆంక్షల ఎత్తివేత: ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న అన్ని రకాల అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను తొలగించాలి. 5. యుద్ధ పరిహారం: యుద్ధం వల్ల ఇరాన్ మౌలిక సదుపాయాలకు, ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టానికి భారీ పరిహారం చెల్లించాలి. 6.క్షిపణి కార్యక్రమం: ఇరాన్ స్వదేశీ క్షిపణి , రక్షణ కార్యక్రమాలపై ఎటువంటి పరిమితులు ఉండకూడదు. 7. హార్ముజ్ జలసంధిపై పట్టు: ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై ఫీజులు వసూలు చేసే హక్కు ఇరాన్‌కు ఉండాలి.ఇరాన్ ప్రతిపాదించిన డిమాండ్లు కేవలం శాంతి ఒప్పందానికి సంబంధించినవి మాత్రమే కావు. అవి ఆ ప్రాంతంలో అమెరికా ఉనికిని నామరూపాలు లేకుండా చేసేలా ఉన్నాయి. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతం నుండి అమెరికా సైనిక స్థావరాలను పూర్తిగా తొలగించాలన్న డిమాండ్.. వాషింగ్టన్ ఏమాత్రం అంగీకరించలేని అంశం. బహ్రెయిన్‌లోని 5వ ఫ్లీట్ వంటి వ్యూహాత్మక కేంద్రాలను వదులుకోవడం అంటే.. పశ్చిమాసియాలో తన పట్టును పూర్తిగా కోల్పోవడమే.మరోవైపు ఇజ్రాయెల్--హిజ్బుల్లా ఘర్షణలపై నియంత్రణ కోరడం ద్వారా ఇరాన్ తన ప్రాక్సీ బలగాలకు రక్షణ కవచం నిర్మించుకోవాలని చూస్తోంది. తన క్షిపణి కార్యక్రమంపై ఎటువంటి ఆంక్షలు ఉండకూడదని కోరడం ద్వారా భవిష్యత్తులో మరింత బలమైన సైనిక శక్తిగా ఎదగాలన్నది టెహ్రాన్ ప్రణాళికగా స్పష్టమవుతోంది. ఆర్థిక అస్త్రం.. హార్ముజ్ జలసంధి ముప్పు ఇరాన్ పెట్టిన షరతుల్లో అత్యంత ప్రమాదకరమైనది హార్ముజ్ జలసంధి ద్వారా వెళ్లే నౌకలపై ఫీజులు వసూలు చేసే హక్కు. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 30 శాతం వాటా ఉన్న ఈ మార్గాన్ని నియంత్రించడం అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పగ్గాలను తన చేతుల్లోకి తీసుకోవడమే. ఇది కేవలం అమెరికాపైనే కాకుండా భారత్, చైనా, జపాన్ వంటి ఆసియా దేశాల ఇంధన భద్రతపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. చమురు ధరలు పెరిగితే ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగి ఆర్థిక మాంద్యానికి దారితీసే ప్రమాదం పొంచి ఉంది. ప్రాంతీయ దేశాల భయం సౌదీ అరేబియా, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలను ఇరాన్ హెచ్చరించడం ఆ ప్రాంతంలో సరికొత్త దౌత్య సంక్షోభానికి దారితీసింది. అమెరికాకు సహకరిస్తే తమపై దాడులు తప్పవన్న హెచ్చరికలు.. ఆయా దేశాలను ఇరకాటంలో పడేశాయి. ఒకవైపు అమెరికా రక్షణ కవచం, మరోవైపు ఇరాన్ భౌగోళిక సామీప్యత మధ్య ఈ దేశాలు నలిగిపోతున్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌ల కఠిన వైఖరి చూస్తుంటే వారు చర్చల కంటే 'వ్యూహాత్మక పైచేయి' సాధించడానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే అమెరికా ఈ షరతులకు తలొగ్గే అవకాశం ఎంతమాత్రం లేదు. అగ్రరాజ్యం తన గౌరవాన్ని, మిత్రదేశాల భద్రతను పణంగా పెట్టి ఈ ఒప్పందానికి ఒప్పుకోదు. ఫలితంగా ఈ ప్రతిపాదనలు శాంతికి మార్గం వేయడం కంటే, యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసేలా ఉన్నాయి. అగ్రరాజ్యాల పంతాల మధ్య మధ్యప్రాచ్యం మరెంత కాలం రావణకాష్టంగా మారుతుందో వేచి చూడాలి. అంతర్జాతీయ సమాజం తక్షణమే జోక్యం చేసుకుని, ఇరు పక్షాలను చర్చల మేజా వద్దకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వారి డైరీ ఆవిష్కరణ



**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలోని. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో. డి ఆర్ ఓ ఆఫీస్ నందు పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వారి డైరీ. యం లక్ష్మి నరసింహం (ఎన్టీఆర్ జిల్లా ఆదాయ శాఖ అధికారి)ఆవిష్కరణ చేశారు.ఈ డైరీలో ట్రస్ట్ ఆరంభం నుంచి నేటి వరకు చేసిన కార్యక్రమలు పొందుపరచడం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కందుల పరమేశ్వర రావు చేస్తున్న కార్యక్రమలు ఆదర్శమైనవి అని చెబుతూ ట్రస్టు సభ్యులు నిరంతరం పేదలకు తమకు ఉన్నదానితో మనస్ఫూర్తిగా సహాయ సహకారాలు అందించటం గొప్ప విషయమన్నారు.కందుల పరమేశ్వర రావు మాట్లాడుతూ ట్రస్ నుంచి చేసే ప్రతి కార్యక్రమం ట్రస్ట్ సభ్యులు, దాతలు, సహకారంతో చేస్తున్నాశీ తాను ఎప్పుడు ఏ సేవా కార్యక్రమం చేద్దాం అన్న మా దాతలు మేము సైతం అని ముందుకు వచ్చి తనకు వాళ్ళ యొక్క సహాయ సహకారాలు పరిపూర్ణంగా అందిస్తూ ఉండటం వల్లనే తాను ఇలాంటి కార్యక్రమాలు చేయగలుగుతున్నానన్నారుఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు , మర్తాడు శిరీష, మర్తాడు రాజేష్, అట్లూరి శ్రీదేవి, మెట్టపల్లి అయ్యప్ప. దేగల రామారావు (డిప్యూటి ట్రైనింగ్ ఆఫీసర్ జె యం ఐ.టి ఐ, చిన్నకాకాని, మంగళగిరి ), జడగం శ్రీనివాస్, శనంపూడి శిరీష, గిద్దలూరు ఎర్రిస్వామి, ఇబ్రహీంపట్నం బ్యాంచి ట్రస్ట్ సభ్యులు, యం నాయక్, షేక్ షబాషి, షేక్ సుల్తాన, వహీదా బేగం, షేక్ రమీజ, షేక్ మతీన్, శ్రీ దుర్గాదేవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు తమ్మా సురేషరెడ్డి, డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు విజయ కుమారి,తదితరులు ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

# థాంక్యూ సి ఎమ్ సారూ

**కాంట్రాక్టర్లకు రూ.1500 కోట్ల విడుదలపై సీఎం చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కృతజ్ఞతలు**




**విజయవాడ పశ్చిమ మార్చి 25:(వార్తా ప్రభ ప్రతినిధి)** కాంట్రాక్టర్లకు 1500 కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పి. శేషగిరిరావు, నేషనల్ ఆల్ ఇండియా ట్రస్టీ సిహెచ్. రామకోటయ్య, అడ్వైజరీ కమిటీ స్పోక్స్ పర్సన్ డి. పంకజ్ రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం విజయవాడలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ గత కొన్ని ఏళ్ల నుంచి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్ల ఇబ్బందులను పరిగణనలో తీసుకొని 1500 కోట్లు రిలీజ్ చేసినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఫైనాన్స్ మినిస్టర్ పయ్యావుల కేశవ్ ,రోడ్స్ అండ్ బిల్డింగ్స్ మినిస్టర్ బీసీ జనార్ధన్ రెడ్డి, మంత్రి నారా లోకేష్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ సెక్రటరీలకు, తదితర అధికారులకు వారు అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్లో రోడ్లను అత్యంత నాణ్యంగా నిర్మిస్తున్నామని, తమ అసోసియేషన్ లో సభ్యులైన కాంట్రాక్టర్లకు దేశవ్యాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని చెప్పారు. ఇంకా వివిధ హెడ్స్ కింద కాంట్రాక్టర్లకు ఉన్న బకాయిలను కూడా ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు లోపే వెంటనే ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు సత్వర చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. రాజధాని అమరావతి నిర్మాణంలో కూడా అభివృద్ధి పనులకు స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్లకు అవకాశం కల్పించాలని వారు కోరారు. సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు బి. రాఘవరావు, వి. వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, వెంకట నాగిరెడ్డి తదితరులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నిరాధార వార్త రాసిన 'సాక్షి' దినపత్రికపై ఎంపీ కేశినేని చిన్ని ఫిర్యాదు

- **కూటమిలో చిచ్చు పెట్టే కుట్ర అంటూ ఆరోపణ**
- **ఎమ్మెల్యే సన్నిహితుల ఫోన్స్ కాల్ డేటా రికార్డులు సేకరించినట్లు ఏమైనా ఆధారాలు ఉంటే బయటపెట్టాలని డిమాండ్**
- **సాక్షి రాతలపై న్యాయపోరాటానికి సిద్ధమైన ఎంపీ కేశినేని శివనాథ్**
- **విజయవాడ పోలీస్ కమిషనర్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, పీఆర్‌జిఐ లకు లిఖిత పూర్వక ఫిర్యాదులు**

**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాజకీయంగా ఎదిరించలేక వైసీపీ రోత పత్రిక సాక్షి ఇప్పుడు దుష్ప్రచారానికి దిగిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని )మండిపడ్డారు. సాక్షి పత్రికలో ప్రచురితమైన తప్పుడు కథనం వెనుక స్పష్టమైన రాజకీయ అజెండా ఉందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. "ప్రజల మద్దతుతో గెలవలేక, అబద్ధాలతో మాయ చేయాలని చూస్తున్నారు…ఇది ప్రజాస్వామ్యంపై దాడి" అని ఆయన ఘాటుగా స్పందించారు. తాను ఎమ్మెల్యే అనుచరుల ఫోన్ కాల్ డేటా వివరాలు సేకరించి పర్యవేక్షిస్తున్నానని ప్రచారం చేయడం పూర్తిగా అబద్ధమని, ఇది ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికి చేసిన కుట్ర అని ఆయన పేర్కొన్నారు. "నిజం లేని వార్తలు సృష్టించి, ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు" అని విమర్శించారు. కూటమి విచ్ఛిన్నం చేయడానికి లోతైన కుట్రలో భాగంగా వైసీపీ కరపత్రం సాక్షి ప్రయత్నాలు మొదలు పెట్టిందని ఈ ఘటనలో పాల్గొన్న సాక్షి సంస్థ మాత్రమే కాకుండా, ఈ కుట్ర వెనుక ఉన్న రాజకీయ శక్తులను కూడా వెలికి తీయాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. వైసీపీ ఇలాంటి చీప్ రాజకీయాలకు దిగడం వారి బలహీనతకు నిదర్శనం. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు అని ఆయన హెచ్చరించారు. భారతీయ న్యాయ సంహిత , ఐటీ చట్టాల ప్రకారం వెంటనే కేసు నమోదు చేసి, బాధ్యులను అరెస్ట్ చేసి, ఈ కుట్రను పూర్తిగా బహిర్గతం చేయాలని ఆయన ఎంపీ శివనాథ్ డిమాండ్ చేశారు. సాక్షి పత్రిక వెంటనే ఆ కథనాన్ని ఉపసంహరించుకుని, ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. సాక్షి కుట్రపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీ తెలియజేసారు.విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే సన్నిహితుల కాల్స్ డేటా రికార్డులు చేయిస్తున్నానంటూ తన వ్యక్తిత్వంను దెబ్బతీసే విధంగా , తన పరువుకు నష్టం కలిగించడమే కాకుండా కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించేలా కథనాలు ప్రచురిస్తున్న 'సాక్షి' దినపత్రికపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజయవాడ పోలీస్ కమిషనర్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌జీఐ)లను కోరడం జరిగింది. ఎమ్మెల్యే అనుచరుల కాల్స్ రికార్డులు చేయిస్తున్నానంటూ తనపై మార్చి 24వ తేదీన 'ఎమ్మెల్యేలపై బుసకొడుతున్న కాల్‌నాగు' అనే శీర్షికతో ప్రచురితమైన వార్త పూర్తిగా నిరాధారమైనదని, తప్పుడు ఆరోపణలతో ఉందంటూ ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. సంబంధిత వార్త ప్రచురించిన సాక్షి యాజమాన్యంపైన, సంపాదకులు, వార్త రాసిన రిపోర్టర్‌లపై చర్యలు తీసుకోవాలంటూ విజయవాడ పోలీస్ కమిషనర్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌జీఐ)లకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లిఖిత పూర్వక ఫిర్యాదులను బుధవారం ఇచ్చారు. తాను అక్రమంగా ఎమ్మెల్యే ప్రధాన అనుచరుల కాల్ డేటా రికార్డులను సేకరిస్తున్నానని, వారి వ్యక్తిగత, రాజకీయ వ్యవహారాలపై నిఘా పెట్టానని సాక్షిలో వచ్చిన వార్త పచ్చి అబద్ధమని ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. ప్రధానంగా విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తన పరువు తీసేందుకు , కూటమిలో చిచ్చు పెట్టే ప్రయత్నంలో భాగంగానే సాక్షి పత్రిక పదే పదే తప్పుడు వార్తలు పరోక్షంగా తనను ఉద్దేశించి రాస్తోందని, ప్రస్తుతం తన పేరును పెట్టి తప్పుడు వార్త ప్రచురించిందని ఆయా ఫిర్యాదుల్లో ఎంపీ పేర్కొన్నారు. సాక్షి పత్రికలో వార్త రాసినట్లుగా తాను ఎమ్మెల్యే ప్రధాన అనుచరుల కాల్ డేటా రికార్డులను సేకరిస్తే అందుకు ముందుగా ఆయా సెల్ కంపెనీలను ఎమ్మెల్యేల అనుచరుల సెల్ నెంబర్లు ఇచ్చి, కాల్ డేటా రికార్డులను కోరాల్సి ఉందన్నారు. ఆ విధంగా తాను ప్రయత్నాలు చేసినట్లు గానీ, సెల్ కంపెనీలను కోరినట్లు గానీ ఏమైనా సాక్షి పత్రిక యాజమాన్యం వద్ద ఆధారాలు ఉన్నాయా? ఉంటే వెల్లడించాలని ఎంపీ కేశినేని శివనాథ్ డిమాండ్ చేశారు. అధికార కూటమి ఎంపీగా ఉన్న తనపై ఏదో రీతిన బురద జల్లేందుకు సాక్షి దిన పత్రిక యాజమాన్యం చూస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. అదే విధంగా తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల మధ్య విభేదాలు సృష్టించి, ప్రజల్లో అలజడి రేపేందుకే ఇటువంటి కల్పిత గాథలను సాక్షి యాజమాన్యం ఉద్దేశ్యపూరిత కుట్రతో అల్లుతున్నారని ఆయన మండిపడ్డారు. సాక్షి దిన పత్రిక యాజామాన్యం ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి కాల్ డేటా రికార్డులను తాను సేకరిస్తున్నట్లుగా ప్రచురించిన కథనంలో మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు తాను నియోజకవర్గంలో వ్యవహారాలు నడుపుతున్నట్లు సాక్షి పేర్కొనడాన్ని ఎంపీ శివనాథ్ (చిన్ని) తీవ్రంగా ఖండించారు. ఇది కేవలం రాజకీయ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు చూపించే దుష్ట ప్రయత్నమని విమర్శించారు . బదిలీలు, కాంట్రాక్టులు, ప్రభుత్వ పనితీరులో తాను అనవసరంగా జోక్యం చేసుకుంటున్నట్లు నిరాధార వార్తలను తరచూ ప్రచురించడం ద్వారా తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఎంపీ ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు . ఇప్పుడు నిరాధారమైన ఆరోపణలతో తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఎమ్మెల్యే అనుచరుల కాల్ డేటా రికార్డులను తాను సేకరిస్తున్నానని, ఎమ్మెల్యేలంతా తనపై కోపంగా ఉన్నారంటూ తన పేరును పత్రికా కథనంలో ఉదహరించి సాక్షి దిన పత్రిక య్యేమాన్యం తన పరువుకు నష్టం వాటిల్లేలా చేసిందన్నారు. ఈ తప్పుడు వార్తల వల్ల తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, ప్రజాప్రతినిధిగా తనకున్న గౌరవానికి భంగం కలిగిందని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు . సమాజంలో అశాంతిని రేకెత్తించి, అల్లర్లకు పురిగొల్పేలా ఉన్న ఈ కథనంపై భారతీయ న్యాయ సంహిత , ఐటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు . 'సాక్షి' యాజమాన్యం, చీఫ్ ఎడిటర్ ఆర్. ధనంజయ రెడ్డి, సంబంధిత రిపోర్టర్లపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన విజయవాడ పోలీసు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు . ఎమ్మెల్యే అనుచరుల కాల్ డేటా రికార్డులను సేకరిస్తున్నానని సాక్షి పత్రికలో తనపై రాసిన వార్త విషయంలో ఆధారాలు ఉంటే వెంటనే బయటపెట్టాలని, లేని పక్షంలో తాను సాక్షి దినపత్రిక యాజమాన్యం , ఎడిటర్, వార్త రాసిన రిపోర్టర్‌లపై క్రిమినల్ చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటంకు సైతం వెనుకాడేది లేదని ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల కాల్ రికార్డుల డేటా సేకరిస్తున్నానని తనపై రాసిన నిరాథరమైన, తప్పుడు వార్తను వెనక్కి తీసుకుంటూ సాక్షి దినపత్రికలోనే తనకు బహిరంగ క్షమాపణ సాక్షి యాజమాన్యం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రముఖ న్యాయవాది నరహరిశెట్టి శ్రీహరి అకాల మృతి

**నివాళులర్పించిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి**

**నివాళులర్పించిన దేవినేని అవినాష్, వెలంపల్లి తదితర నేతలు**









**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రముఖ హైకోర్టు న్యాయవాది, సమైక్యాంధ్ర ఉద్యమ నేత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి శ్రీహరి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. సుదీర్ఘ కాలంగా న్యాయవాదిగా పని చేస్తున్న శ్రీహరి సమైక్యాంధ్ర ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. అలాగే నేషనల్ కాపు ఫెడరేషన్ పేరుతో కాపు ఉద్యమానికి అండగా నిలిచారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో ఏపీ మద్య విమోచన ప్రచార కమిటీ కార్యదర్శిగా పని చేశారు. అలాగే వావిలాల గోపాలకృష్ణయ్య ఆధ్వర్యంలో మద్య విమోచన ప్రచారానికి కృషి చేస్తూ ప్రత్యేకంగా మద్యానికి వ్యతిరేకంగా పత్రికను నిర్వహించారు. కాపుల సమస్యలపై ఆయన పలు కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పాతబస్తీ అభివృద్ధి పోరాట సమితి పేరుతో ఈ ప్రాంత అభివృద్ధికి పలు కార్యక్రమాలను నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు న్యాయవాదిగా సుదీర్ఘకాలం పని చేశారు. ఆయన మరణ వార్త తెలియగానే ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏవీ శేషసాయి వన్‌టౌన్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, ఆ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పీ గౌతంరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, మాజీ శాసనసభ్యులు వంగవీటా రాధా, కిలారు రోశయ్య, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (హైదరాబాద్) అధినేత ఉమారెడ్డి రమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాము, వివిధ పార్టీలకు చెందిన కొలనుకొండ శివాజీ, ఆకుల శ్రీనివాస్, మహాదేవు అప్పాజీరావు, నరేంద్ర, కొనిజేటి రమేష్ తదితరులు నివాళులర్పించారు. అలాగే శ్రీహరి సోదరుడు నరహరిశెట్టి నరసింహరావు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షునిగా పని చేస్తున్నారు. రాష్ట్రం విడిపోకుండా ఉండాలని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని మొదలు పెట్టింది శ్రీహరి అని పలువురు ఆయనకు నివాళులర్పించారు. గురువారం ఉదయం పదకొండు గంటలకు నరహరిశెట్టి శ్రీహరి అంతిమయాత్ర ఉంటుందని ఆయన కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## వాటర్ ట్యాంక్ త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు**





**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వాటర్ ట్యాంక్ త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా లబ్బీపేట, ఏలూరు రోడ్డు, గుణదల, మహానాడు రోడ్డు, ఆయుష్ హాస్పిటల్ రోడ్, పటమట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహానాడు రోడ్లు గల కనకదుర్గ నగర్ లో జరుగుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణపనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. డెంటల్ కాలేజ్ రోడ్డు గుణదల లో గల మరుగుదొడ్లను పరిశీలించి అందులో ఉన్న మరమ్మతులను త్వరగా పూర్తిచేయాలని అన్నారు. నగరంలో అన్ని మరుగుదొడ్లు ఎటువంటి మరమ్మతులు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఏవైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే వాటిని పూర్తిచేయాలని అన్నారు. తదుపరి హై టెన్షన్ లైన్ రోడ్లో పర్యటించి ఆ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.తదుపరి పటమట లో గల అన్నా క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆహారంలో నాణ్యత, త్రాగునీరు, వాడుకనీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఆహారం కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ వారు కల్పించే అన్ని సౌకర్యాలలో ఎటువంటి సమస్యలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చూస్తూ ఉండాలని ఆదేశించారు.ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె. అర్జునరావు, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జీ. సామ్రాజ్యం, గోపాలకృష్ణ, ప్రభాకర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాల నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## బెజవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో హీరో శర్వానంద్



**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హీరో శర్వానంద్ తన తాజా చిత్రం "బైకర్" ప్రమోషన్స్‌లో భాగంగా ఈరోజు (మార్చి 25, 2026) విజయవాడ కనక దుర్గమ్మను దర్శించు కున్నారు.ముఖ్య ఉద్దేశ్యం: ఏప్రిల్ 3న విడుదల కానున్న "బైకర్" సినిమా ఘనవిజయం సాధిం చాలని కోరుకుం టూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. శర్వానంద్‌తో పాటు హీరోయిన్ మాళవిక నాయర్, చిత్ర యూనిట్ సభ్యులు ఈ దర్శనంలో పాల్గొన్నారు.

## నిర్మాణ వ్యర్థాలతో సంపద సృష్టించేందుకు సి అండ్ డి ప్లాంట్

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలోని నిర్మాణ వ్యర్థాలతో సంపదను సృష్టించేందుకు సిఎన్డి ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం సాయంత్రం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్ లో గల గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్లోని సి అండ్ డి ప్లాంట్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిర్మాణ వ్యర్థాలు ఎక్కడున్నా సరే వాటిని అజిత్ సింగ్ నగర్ లో గల గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ లోకి తరలించి, అక్కడున్న సిఎన్డి ప్లాంట్ని ఉపయోగించి నిర్మాణ వ్యర్థాలతో పాదచర్ల కోసం వేసే పేపర్ బ్లాక్స్, సిమెంట్ ఇటుకలు తయారుచేసి విజయవాడ నగరపాలక సంస్థ చేసే అభివృద్ధి పనుల్లో ఉపయోగించాలని, ప్రజలకు కావాలన్నా విజయవాడ నగరపాలక సంస్థ వారు నుండి పొందవచ్చని అన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రణాళిక అధికారులు ఎప్పటికప్పుడు డ్రోన్ తో పర్యవేక్షిస్తూ నిర్మాణ వ్యర్థాలు ఎక్కడా లేకుండా నిర్ధారించుకోవాలని అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆంధ్రాలో ప్రకాశిస్తున్న 'పీఎం సూర్య ఘర్ '

- దేశవ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు లబ్ధి
- ఆంధ్ర ప్రదేశ్‌లో 1.14 లక్షల ఇళ్లపై సౌర పలకలు
- లోక్ సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్నకు కేంద్రం సమాధానం




**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' (పీఎంఎస్‌జీ : ఎంబీవై ) పథకం ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశిస్తోంది. పథకం వేగంగా అమలు జరుగుతోంది. ఈ విషయాన్ని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ లోక్ సభలో వెల్లడించారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం పురోగతిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో పాటుగా పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' (పీఎంఎస్‌జీ : ఎంబీవై ) పథకం ద్వారా దేశవ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 66.48 లక్షల దరఖాస్తులు రాగా, 26.20 లక్షల ఇన్‌స్టాలేషన్లు పూర్తయ్యాయని దీనివల్ల మొత్తం 32,40,068 కుటుంబాలు ప్రయోజనం పొందాయని తెలిపారు. ఈ పథకం అమలుకు కేంద్రం ఇప్పటివరకు రూ. 17,967.46 కోట్ల సబ్సిడీని విడుదల చేసిందని మంత్రి పేర్కొన్నారు . అదే విధంగా ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పటివరకు 1,14,313 గృహాలపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు మంత్రి శ్రీపాద్ యశో నాయక్ తెలిపారు. 2024 ఫిబ్రవరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం ప్రారంభమైందని, పథకం ప్రారంభం నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు . ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా 32,40,068 ధరఖాస్తులు రాగా రాష్ట్రంలో మొత్తం 14,72,814 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. వీటిలో 1,14,313 దరఖాస్తులకు సంబంధించి ఇన్‌స్టాలేషన్లు ఇప్పటికే పూర్తయినట్లు మంత్రి తెలిపారు. తద్వారా 1,17,453 కుటుంబాలకు రాష్ట్రంలో లబ్ధి చేకూరిందనీ, ఈ పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 734.97 కోట్లను ఆర్థిక సహాయం (సబ్సిడీ) రూపంలో ఈ ఏడాది మార్చి 20 నాటికి నేరుగా పంపిణీ చేసిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం అమలు పురోగతిని జిల్లాల వారీగా పరిశీలిస్తే ...పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా 1,62,506 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. సోలార్ పలకల ఏర్పాటులో గుంటూరు జిల్లా 7,767 యూనిట్లతో అగ్రస్థానంలో ఉందన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఏలూరు (7,341), కాకినాడ (6,878), కృష్ణా (6,871), విశాఖపట్నం (6,208) జిల్లాలు ఉన్నాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అతి తక్కువగా 62 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,508 మంది రిజిస్టర్డ్ వెండర్లు సోలార్ పలకల ఏర్పాటు సేవలు అందిస్తున్నారని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 'మోడల్ సోలార్ గ్రామాల'ను ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. అనకాపల్లి జిల్లా బయ్యవరం, కాకినాడ జిల్లా తిమ్మాపురం, శ్రీకాకుళం జిల్లాలో అంపోలు, తూర్పు గోదావరి జిల్లాలో మలకపల్లి, కోనసీమ జిల్లాలో వానపల్లి, విజయనగరంలో బొడ్డం, పశ్చిమ గోదావరి జిల్లాలో ఆలంపూర్, విశాఖపట్నంలో ఆర్. తాళ్లవలస, పార్వతీపురం మన్యంలో నరిపురం, ఏలూరుజిల్లాలో తాడికలపూడి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, కర్నూలు జిల్లాలో పెద్దహరివాణం గ్రామాలను మోడల్ సోలార్ గ్రామలుగా ప్రకటించడం జరిగిందన్నారు. ఇక సోలార్ విద్యుత్ ఉత్పత్తి విషయానికొస్తే...ఒక కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ ద్వారా రోజుకు సగటున నాలుగు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని మంత్రి వివరించారు . రాష్ట్రంలో మెజారిటీ గృహాల్లో నెట్-మీటరింగ్ విధానం అమలులో ఉందని, కొన్ని చోట్ల స్మార్ట్ మీటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు .

## డీఎంహెచ్వో ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ అడ్వైజరీ కమిటీ సమావేశం.



**మచిలీపట్నం మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి యుగంధర్ అధ్యక్షతన జిల్లా వైద్య శాఖ కార్యాలయం ఛాంబర్ పిసిపి ఎన్డిటి డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ మీటింగ్ జరిగినది ఈ మీటింగ్ నందు అనంత హాస్పిటల్ తాడిగడపకు కొత్తగా రిజిస్ట్రేషన్ కి అనుమతి మంజూరు చేయడం కొరకు కమిటీ ఆమోదం తెలిపింది, అలాగే ఎస్ డి హెల్త్ కేర్ వారు డాక్టర్ పిన్నమనేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారు దరఖాస్తు చేసుకున్న మోడిఫికేషన్ లకు అనుమతులు మంజూరు చేయడం కొరకు కమిటీ ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ తో పాటు డాక్టర్ ఏ.వి స్వర్ణలత గైనకాలజిస్ట్, డాక్టర్ దీప్తి పిల్లల వైద్యురాలు, డాక్టర్ ఐ. వినిల్ రేడియాలజిస్ట్ ఎల్ వెంకటేశ్వరరావు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్జీవో లు ఎం. ధర్మ తేజ,కే. సుశీల పాల్గొన్నారు.

## 55వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడిగా షేక్ సలీం నియామకం

*మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు*



**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మాజీ మంత్రి వెలంపల్లి ని కలిసిన 55వ డివిజన్ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 55వ డివిజన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన షేక్ సలీం, బుధవారం నాడు మాజీ మంత్రి మరియు నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు షేక్ సలీం మాజీ మంత్రికి శాలువా కప్పి, ఘనంగా సత్కరించి తన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం డివిజన్ నాయకులందరూ 5ఏళ్లు కార్పొరేటర్ గా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న శిరంశెట్టి పూర్ణచంద్రరావుని శాలువాతో సత్కరించారు .ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావుతో పాటు 55వ డివిజన్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నూతన అధ్యక్షులు డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాలని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.అనంతరం షేక్ సలీం మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన వెలంపల్లి శ్రీనివాసరావుకు మరియు పార్టీ నాయకత్వానికి రుణపడి ఉంటానని, డివిజన్ అభివృద్ధికి మరియు పార్టీ అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## నియోజకవర్గాల పునర్విభజన నిర్ణయం హర్షణీయం

**టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం**



**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజన నిర్ణయం హర్షనీయమని టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నియోజకవర్గాల పునర్విభజన నిర్ణయం దేశంలోని అన్ని వర్గాల వారికి ప్రయోజనాన్ని చేకూరుస్తుందని తెలిపారు. విజయవాడ గురునానక్ కాలనీలోని పార్లమెంటు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాదిగాని గురునాథం మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ ద్వారా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల సంఖ్య భారీగా పెరగనుందన్నారు. భారత ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులుగా, ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులుగా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రాల్లోనూ ప్రజా ప్రాతినిధ్యం మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 543 లోక్‌సభ స్థానాలను 816కు, అలాగే 4,123 అసెంబ్లీ స్థానాలను 6,185కుపెంచాలని నిర్ణయించారన్నారు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 175 అసెంబ్లీ స్థానాలు 263కు పెరుగుతాయన్నారు . లోక్‌సభ స్థానాలు 25 నుండి 38కి పెరిగే అవకాశం ఉందన్నారు. అదే రీతిలో తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 119 నుండి 179కి, లోక్‌సభ స్థానాలు 17 నుండి 26కు పెరుగుతాయన్నారు. . నియోజకవర్గాల పునర్విభజనతోమహిళా రిజర్వేషన్ల బిల్లు అమలు జరిగి పార్లమెంట్‌లో మహిళలకు 278 సీట్లు దక్కనున్నాయన్నారు. దేశవ్యాప్తంగా అదనంగా 2,062 అసెంబ్లీ స్థానాలను మహిళలకు కేటాయించనున్నారనీ , ఆంధ్రప్రదేశ్‌లోని 175 నియోజకవర్గాలలో దాదాపు 67 సీట్లు మహిళలకు కేటాయించే అవకాశం ఉందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం మహిళా సాధికారతకు బాటలు వేస్తుందని గురునాథం కొనియాడారు దాదాపు 100 అసెంబ్లీ స్థానాల పెరుగుదలతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజకీయంగా విశేష ప్రాధాన్యత లభించనుందన్నారు. . ఏపీలో ఎస్సీలకు సుమారు 50 అసెంబ్లీ స్థానాలు, ఎస్టీలకు 19 స్థానాలు పెరిగే అవకాశం ఉందని అంచనా ఉందన్నారు. దీనివల్ల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశించిన విధంగా పరిపాలన వికేంద్రీకరణ జరుగుతుందని, చిన్న నియోజకవర్గాల ఏర్పాటుతో ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని అన్నారు. నియోజకవర్గాల సంఖ్య పెరగడం వల్ల యువత మరియు విద్యార్థులు రాజకీయాల్లోకి రావడానికి మెరుగైన అవకాశాలు లభిస్తాయని యువనేత లోకేష్ పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు . గతంలో 2013లో రాష్ట్ర విభజన సమయంలో జరగాల్సిన డీలిమిటేషన్ జరగకపోవడం వల్ల ఏపీ కొన్ని స్థానాలను కోల్పోయిందని, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంతో ఆ లోటు భర్తీ అవుతుందని ఆయన తెలిపారు . 2013 లోనే డీలిమిడిషన్ ప్రక్రియ జరిగే ఉంటే అప్పట్లోనే 225 అసెంబ్లీ స్థానాలు వచ్చేవని, ఇప్పుడు మరిన్ని పెరిగేవన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి 2027 మార్చి 1 నాటికి జనగణన పూర్తవుతుందనీ, ఆ తర్వాత ఓటర్ల ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుందన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి క్రిస్టియన్ లీగల్ సెల్ నాయకులు చాట్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు...

## ఏ బిడ్డ అనాధగా మిగిలిపోకూడదు.

**కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.**



**మచిలీపట్నం మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏ బిడ్డా అనాదిగా మిగిలిపోకూడదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నార దత్తత తీసుకునేందుకు ముందుకు వస్తున్న దంపతులు ఎంతో మందికి ఆదర్శనీయులని, ఏ బిడ్డా అనాథగా మిగిలిపోకూడదని కలెక్టర్ అన్నారు. కెనడాకు చెందిన ప్రశాంత్ నంబిసన్ సుధా సుందరం దంపతులు 2021 సంవత్సరంలో కారా పోర్టల్‌లో దత్తత నమోదు చేసుకున్నారన్నారు .బుద్దవరం శిశుగృహం లో ఆశ్రయం పొందిన సత్యం బాబు, భవాని అనే ఇద్దరు పిల్లలను (తోబుట్టువులు) దత్తత ఇవ్వటం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ఎం.ఎన్. రాణి, డిసిపిఓ కిషోర్,ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

## రామాలయానికి వితరణ.



**రాజాం, మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలం లో సీతంపేట గ్రామంలో నూతనంగా రామాలయం నిర్మాణానికి 25వేల రూపాయలు డా: గార రవి ప్రసాద్ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ నాగల అప్పలనాయుడు , కంచరం సర్పంచ్ ప్రతినిధి అప్పలనాయుడు, రామాలయం నిర్మాణ బాధ్యులు నెక్కెట్ల రామినాయుడు, ఇద్దం సత్తిబాబు, పట్టి ఆదిబాబు , కొల్లి దాలి నాయుడు, ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైవిధ్య పంటల సాగుతో సుస్థిర వ్యవసాయానికి బాటలు వేయండి

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**

**గుంటుపల్లి లో రైతన్నా మీకోసం గద్దె అనూరాధ గారితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే**






**ఇబ్రహీంపట్నం,మార్చి 25(వార్తా ప్రభ ప్రతినిధి):**రైతులు వైవిధ్య పంటల సాగుతో సుస్థిర వ్యవసాయానికి బాటలు వేసి అధిక దిగుబడి, నికరాదాయం పొందాలనిమైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచించారు. ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ వారికి పెట్టుబడి ఖర్చుల కోసం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని అమలుచేస్తోందన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ తో కలిసి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ రైతన్నా మీకోసం కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రైతులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి శ్రేణులతో కలిసి 'రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం' పేరుతో రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. నీటి భద్రత, పంటల ప్రణాళిక, ఆధునిక సాంకేతి కత, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రిజర్వాయర్లలో నీరు ఉన్న నేపథ్యంలో మే 15 నుంచి ముందస్తు సాగు మొదలు పెట్టాలి. దీనివల్ల అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉంది. అందువల్ల నీటిని పొదుపుగా వినియోగించాలన్నారు.కృత్రిమ మేధ(ఏఐ), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. సహజ పద్ధతుల్లో సేంద్రీయ ఎరువులతో పంటల సాగుతోనే రైతులు తమ పొలాలలో ఆరోగ్యవంతమైన పంటల దిగుబడులు సాధించవచ్చన్నారు.రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు రాయితీ కింద కిసాన్ డ్రోన్ల యంత్రాలు, రైతులు పండించే ధాన్యం సేకరించడం, బిందు, తుంపర సేద్యాన్ని విస్తరింప చేయడం, సన్న, చిన్న కారు రైతులకు రాయితీలను అందించడంతో పాటు పంట నాణ్యత గణనీయంగా పెంచుతున్నట్లు పేర్కొన్నారు.వ్యవసాయ అనుబంధ శాఖల పరిజ్ఞానాన్ని రైతులకు అందిస్తూ క్షేత్రస్థాయిలో రైతు సమస్యలు పరిష్కరించడానికి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సాగునీటి సౌకర్యాలు కల్పిస్తూ రైతులను అన్ని విధాల ఆదుకుని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన రైతులకు సూచించారు.తుమ్మలపాలెం ఎత్తిపోతల పథకం విద్యుత్తు బిల్లుల బకాయి సమస్యను ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. ఖాజీమాన్యం, రెవెన్యూ సంబంధిత దీర్ఘకాలిక సమస్యలను కూడా ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అమరావతి రాజధాని మన మైలవరం ప్రాంతానికి కూడా వరమన్నారు. జల్ జీవన్ పథకంకు కేంద్రం 11,500 కోట్ల నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సేవలో సాటిలేని 'మానవత

**సంతకవిటి మండలానికి ఫ్రీజర్ బాక్స్ వితరణ**



**రాజాం, మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కష్ట కాలంలో ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని రాజాం మానవత విభాగం మరోసారి నిరూపించింది. సామాజిక సేవలో భాగంగా బుధవారం సంతకవిటి మండలానికి సుమారు 75 వేల రూపాయల విలువైన డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్సును అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. మారుమూల ప్రాంతాల్లో అంతిమ సంస్కారాల సమయంలో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర్ యాదవ్, ఉపాధ్యక్షులు గట్టి పాపారావు, సభ్యులు కొల్లూరు వెంకట్ నాగేశ్వరరావు, పందూరి వేణుగోపాల్, బొత్స జానకిరామ్, శాపపు సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్, శిమకుర్తి ప్రసాద్, కొల్ల పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## ఆణిముత్యాలు - అక్షర సత్యాలు



చిరునవ్వులు చిందిస్తే
పెరుగుతుంది అందమే
చేయి చేయి కలిపితే
వర్ధిల్లును స్నేహమే
నమ్మకమే లోపిస్తే
బలహీనమగు బంధమే
బద్ధకం ఆవహిస్తే
అభివృద్ధిక శూన్యమే
ప్రతీకారం పెరిగితే
జరుగుతుంది నష్టమే
క్షమాగుణం వీడితే
అడుగడుగునా వైరమే
అడుగు ముందుకేస్తుంటే
తగ్గుతుంది దూరమే
బాధలు పంచుకుంటే
తరుగుతుంది భారమే

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

## పెనుమల్లి లో జడ్పీటీసీ సర్పంచ్ లకు కలెక్టర్ ప్రశంసలు



**పెడన మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వేరు వేరు పార్టీలకు చెందినప్పటికీ గ్రామాభివృద్ధి కోసం కృషి చేసిన జడ్పిటిసి సర్పంచ్లను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం నాడు అభినందించారు.జడ్పీటీసీ నగేష్ టీడీపీ కాగా సర్పంచ్ రామా నాయుడు వైసీపీ. బుధవారం నాడు జిల్లా కలెక్టర్ ఈ గ్రామంలో పర్యటించారు ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన అభివృద్ధిని ఆయన సమీక్షించారు. ఇందుకు సహకరించిన ఇద్దరినీ ఆయన అభినందించారు

## ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో ఎల్వోసీ ల అంద చేత..



**విజయవాడ పశ్చిమ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ లేఖలను లబ్ధిదారులకు అంద చేశారు.. నియోజకవర్గంలోని 39 వ డివిజన్ కు చెందిన జాడు వీర్రాజు , లివర్ సంబంధిత వ్యాధి తో బాధ పడుతూ ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించారు. ఆయన సర్జరీ కు అవసరమైన 6,80,000/- రూపాయల సాయం అందించాలంటూ ఎమ్మెల్యే సుజనా చౌదరి సీఎం ఆర్ ఎఫ్ కు లేఖ రాసారు.. అదే విధంగా 43వ డివిజన్ కు చెందిన 11 సంవత్సరాల సాయి కౌశిక్ రెడ్డి ప్రమాదంలో చెయ్యి ఫ్రాక్చర్ కావడంతో సర్జరీ కు అవసరమైన 75,000/- రూపాయలు సాయం కోసం లేఖను రాసారు.. రెండు ఎల్వోసీ లను బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అంద చేశారు.. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, బీజేపీ నాయకుడు పగడాల కృష్ణ, గలేటి లక్ష్మణరావు, సుజనా మిత్ర కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## హైకింగ్ రెస్టారెంట్‌లో తనిఖీ!!

- కుళ్ళిన మాంసం, బొద్దింకల పిండి స్వాధీనం
- బార్‌లో అపరిశుభ్ర బాగోతం
- విచ్చలవిడిగా నిబంధనల ఉల్లంఘన.. కేసు నమోదు!





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 25 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖనిలోని హైకింగ్ బార్ అండ్ రెస్టారెంట్‌లో ఆహార భద్రతా అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారని ఫుడ్ ఇన్స్పెక్టర్ అరవింద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా రెస్టారెంట్ వంటగది, దాని పరిసరాలు అత్యంత అపరిశుభ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా పిండి పదార్థాలలో బొద్దింకలు ఉండటాన్ని గమనించి, సుమారు 35 కిలోల గోధుమ పిండి, 10 కిలోల మైదా పిండిని అక్కడికక్కడే పారవేయించారు. వీటితో పాటు నిల్వ ఉంచిన మాంసం, గడువు ముగిసిన పెరుగు, తందూరి చికెన్, పచ్చి చికెన్ లివర్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కట్ చేసి బహిరంగంగా ఉంచిన సలాడ్లను కూడా తొలగించారు. ఆహార తయారీలో వాడుతున్న సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామని, ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, లైసెన్సింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను రెస్టారెంట్ యజమానులపై కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని ఫుడ్ ఇన్స్పెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## నృసింహుని హుండీ ఆదాయం రూ.43,90,520 లు



**మంగళగిరి:మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఎగువ, దిగువ సన్నిధులతోపాటు శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం కు భక్తులచే సమర్పించబడిన కానుకలు ,మొక్కుబడుల కు సంబంధించి రూ.43,90,520 ల హుండీ ఆదాయం సమకూరినట్లు దేవస్థాన సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి కోగంటి సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం నృసింహుని దేవస్థానం దిగువ సన్నిధిలో హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎగువ సన్నిధిలోని శ్రీపానకాల స్వామివారికి రూ. 16,74,302 లు, దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి రూ.26,06,239 లు, శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి రూ. 79, 682 లు, అన్నదానం కు రూ. 30,297 ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గతంలో హుండీలకు రూ.38,70,176 ల ఆదాయం సమకూరగా గతం కంటే ప్రస్తుతం రూ.5,20, 344 లు అధిక ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని వైకుంఠపురం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి వి. అనుపమ పర్యవేక్షించారు.

## పెట్రోల్ కొరత లేదు... పుకార్లను నమ్మకండి-ఎస్పీ

**-బహిరంగంగా పెట్రోల్ అమ్మిన వ్యక్తి పై కేసు నమోదు**

**ఆదిలాబాద్ మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓల్డ్ బస్టాండ్ నందు ఖాన్ బేకరీ లో నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా పెట్రోల్ విక్రయం చేస్తున్న ఫైజల్ పై కేసు నమోదు చేయడం జరిగింది.అతని వద్ద నుంచి 30 లీటర్ల పెట్రోల్‌ను, అధిక ధరలకు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నటువంటి డబ్బాలను,స్వాధీనం చేసుకొని చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు ఎస్పీ తెలిపారు.ప్రాథమిక దర్యాప్తులో, అధిక ధరలకు డబ్బాల్లో పెట్రోల్ విక్రయిస్తూ ప్రజలను మోసం చేయడమే కాకుండా,ఈ చర్యలు ప్రజల ప్రాణాలకు,ఆస్తులకు తీవ్రమైన ముప్పుగా మారే అవకాశమున్నందున,సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.అదేవిధంగా,నిబంధనలను అతిక్రమించి ఇలాంటి వ్యక్తులకు పెట్రోల్ సరఫరా చేసిన బంక్ యజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.ప్రజలు "పెట్రోల్ కొరత" పేరుతో వ్యాప్తి చెందుతున్న పుకార్లను నమ్మవద్దని ఎస్పీ సూచించారు .ప్రజలు"పెట్రోల్ లేదంటూ"దుష్ప్రచారం చేసేవారి మాటలకు నమ్మవద్దని,అలా చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ బి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

# ఒకటే సంస్థ.. రెండు నీతులు

- కొలువుల్లో ప్రైవేట్ గోల్‌మాల్ ● బుట్టదాఖలైన సర్క్యులర్ ● కార్మికుల బిడ్డలకు అన్యాయం
- నిప్పులు చెరుగుతున్న రిటైర్డ్ ఉద్యోగ సంఘాలు ● పోరుబాటతో చుట్టు ముట్టుతున్న కార్మిక సంఘాలు




**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 25 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి సంస్థలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ నియామక ప్రక్రియ ప్రస్తుతం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ముఖ్యంగా స్థానిక భూనిర్వాసితులు, కార్మిక కుటుంబాల హక్కులను కాలరాస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థ అభివృద్ధి కోసం భూములిచ్చిన నిర్వాసితులకు, రక్తం ధారపోసిన రిటైర్డ్ ఉద్యోగుల బిడ్డలకు, స్థానిక నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని 20 సెప్టెంబర్ 2025న స్పష్టమైన సర్క్యులర్ జారీ అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉండటం గమనార్హం. పర్మినెంట్ కార్మికులకు ఒక న్యాయం, కాంట్రాక్టు కార్మికులకు మరో న్యాయం అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది స్వార్థపూరిత అధికారులు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలతో చేతులు కలిపి, నిబంధనలను తుంగలో తొక్కుతూ తమకు నచ్చిన వారికి కట్టబెడుతున్నారని, దీనివల్ల అర్హులైన స్థానిక అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెండర్ ప్రక్రియలో పారదర్శకత లోపించడం, ఎంపిక విధానాన్ని బహిర్గతం చేయకపోవడం వంటి చర్యలు అధికారుల అవినీతికి అద్దం పడుతున్నాయని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఈ ప్రాంతంలోని బొగ్గు గనుల వల్ల వారు కాలుష్యాన్ని భరిస్తున్నాం అని, ఉపాధి అవకాశాలు మాత్రం బయటి వ్యక్తులకు దక్కుతున్నాయని స్థానిక యువత నినదిస్తోంది. యాజమాన్యం తక్షణమే స్పందించి సర్క్యులర్ ప్రకారం నియామకాలు చేపట్టకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని, న్యాయపోరాటానికి కూడా వెనుకాడబోమని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. పారదర్శకత లేని ఈ నియామక ప్రక్రియపై సింగరేణి ఉన్నతాధికారులు లోతైన విచారణ జరిపి, స్థానికులకు, భూనిర్వాసితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా అక్రమంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం

- శేరిలింగంపల్లి మియాపూర్ సర్కిల్ 48 మక్త మహబూబ్‌పేట్ 44 సర్వే నెంబర్‌లో.
- 16 ఫిర్యాదుల్లో 3 భవనాలు సీజ్, ఇంకా 13 నిర్మాణాలు కొనసాగింపు
- మిగతా నిర్మాణాలను వెంటనే సీజ్ చేసి ప్రజలను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్












**శేరిలింగంపల్లి,మార్చి 25 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి మియాపూర్ సర్కిల్ 48 లోని మక్త మహబూబ్‌పేట్‌లోని 44 సర్వే నెంబర్ పరిధిలో పర్మిషన్ లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణిలో మొత్తం 16 ఫిర్యాదులు అందగా,అందులో మూడు భవనాలను సిఎంసీ అధికారులు సీజ్ చేయడాన్ని స్థానికులు అభినందించారు.అయితే ఇంకా 13 భవనాలు నిర్మాణంలో కొనసాగుతున్నాయని, అవి కూడా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే వాటిని కూడా సీజ్ చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.హైకోర్టు ట్రిబ్యునల్ బెంచ్ 2016లోనే 44 సర్వే నెంబర్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొంతమంది అక్రమంగా ఐదు,ఆరు అంతస్తులతో పాటు 100 గజాల్లో ఏడు అంతస్తుల భవనాలు కూడా నిర్మిస్తున్నారని స్థానికులు తెలిపారు.నాణ్యతలేని నిర్మాణాలతో తక్కువ ధరలకు ఫ్లాట్లు విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మిగతా భవనాలను కూడా తక్షణమే సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా 'రైజ్' సెంటర్.

**-ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా...**







**విజయవాడ: మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహిళలను కేవలం గృహిణులుగా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో నోవాటెల్ హోటల్ లో నిర్వహించిన 'విమెన్ హుడ్' కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు., గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలను పారిశ్రామిక దిశగా నడిపించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ముఖ్యంగా 'ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త' అనే కాన్సెప్ట్‌లో భాగంగా మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య మెరుగుపడాల్సి ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితి చాలా ఆశాజనకంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.గ్రామీణ మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'రైజ్' సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే మహిళలకు ఎటువంటి ముందస్తు అనుభవం లేకపోయినా, కేవలం ఆలోచనతో వస్తే చాలని, వారికి అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ మెళకువలు మరియు సాంకేతిక సహకారాన్ని ఈ సెంటర్ల ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కోసం నీతి ఆయోగ్ నుండి రూ. 1.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని, జిల్లా వ్యాప్తంగా ఈ కేంద్రాలను విస్తరిస్తామని ఆయన తెలిపారు. ఫిక్కీ ఫ్లో వంటి సంస్థల సహకారంతో విజయవాడను మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా మారుస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం ఇన్నర్ వీల్ ఇంటర్నేషనల్ మాజీ కోశాధికారి సరిత లునాని మాట్లాడుతూ మహిళలు స్వభావరీత్యా బహుముఖ ప్రజ్ఞాశాలలని వారు లేనిదే ఈ సృష్టి మనుగడ సాధ్యం కాదని అన్నారు. పురాణాల కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు మహిళల ప్రాముఖ్యత అపారమని కొనియాడారు. హిందూ మతంలో శివ-పార్వతులు, రామ-సీత, విష్ణు-లక్ష్మి వంటి దైవ శక్తులు కూడా మహిళా శక్తితో ముడిపడి ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. పురుషులు సంపాదనలో, కుటుంబ పోషణలో మంచి పాత్ర పోషించినప్పటికీ, ఒక మహిళా చేసే బహుముఖ పనులను వారు చేయలేరని ఆమె అభిప్రాయపడ్డారు.తదనంతరం ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమిత కుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి,మహిళాభివృద్ధికి తమ చాప్టర్ ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు.అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను కలెక్టర్ లక్ష్మీ షా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి సుప్రిత, ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ సీనియర్ చైర్ పర్సన్ సుప్రియ మలినేని,దీప్తి చలసాని, తులజ , దుర్గా సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం భోజనాలు విద్యార్థులు సంతృప్తికరంగా భుజించాలి

**నాణ్యత విషయంలో ఒక చిన్న లోటు ఉన్నను చర్యలు తీసుకుంటాము.**

**విద్యార్థిని,విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి కొలుసు పార్థసారథి ...**





**ఏలూరు/ఆగిరిపల్లి, మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలం1 మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విద్యార్థిని, విద్యార్థులతో కలిసిభోజనం చేశారు. భోజనం తింటూ విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలు ఏలా చెప్తున్నారు, భోజనం ఏలా ఉంటుందని, తదితర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అకస్మికంగా తనిఖీలు చేశామని, విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించామని, విద్యార్థులు సంతృప్తి చెందారని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజన నాణ్యతను ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగగ్గా పరిశీలించాలని ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. భోజన నాణ్యతలో ఎక్కడైనా లోపాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. గత ఐదేళ్లలో చేయలేని ఉపాధ్యాయులు భర్తీని కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధిపాము శారద, విద్యా కమిటీ చైర్మన్ కంచిర్ల అంజయ్య, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లా పరీక్షా కేంద్రంలో ఉపకులపతి తనిఖీ.



**మచిలీపట్నం మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న లా పరీక్షల కేంద్రాన్ని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాంజీ తనిఖీ చేశారు. బుధవారం ప్రారంభమైన లా మొదటి, ఐదవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి కృష్ణా విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాలలో పరీక్షా కేంద్రం ను ఏర్పాటు చేశారు. మచిలీపట్నం దైత శ్రీరాములు హిందూ లా కళాశాలకు చెందిన నా 150 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె. రాంజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి ఏర్పాట్లు ను పరిశీలించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు ఆధ్వర్యములో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బంది ఏర్పాట్లు చేశారు. రాజకీయ నాయకులు, విద్యాధికులు లా పరీక్షల కు హాజరుకావడం గమనార్హం.

## ఆదిశంకరాచార్య అద్వైతత్వ సంగీత నాటకోత్సవాలు ప్రారంభం



**హైదరాబాద్ :మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్, ధాత్రి సంక్షేమ సంఘం, ధాత్రి కళాంజలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య అద్వైతత్వ సంగీత నాటకోత్సవాలు బుధవారం గోపాల్ నగర్ కమ్యూనిటీ హాల్లో ప్రారంభమయ్యాయి.. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.. కార్యక్రమంలో శాంతి కుమారి మల్లాది సంధ్య సుధా రాజు సుబ్బారాయుడు జానకి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

## రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం -ఎమ్మెల్యే యార్లగడ్డ




**గన్నవరం, మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి):**మానికొండ గ్రామంలో నిర్వహించిన "రైతన్న మీ కోసం" వారోత్సవాల కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణ జిల్లా టీడీపీ అధ్యక్షులు వీరంకి వెంకట గుర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో రైతుల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేసి, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గన్నవరం నియోజకవర్గం నుంచే పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ నిధులను రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబు ప్రారంభించినట్లు గురుమూర్తి తెలిపారు. రైతులకు ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ స్థాపన తర్వాత ఎప్పుడూ లేని విధంగా మానికొండ గ్రామం భారీ మెజారిటీ ఇచ్చిందని, అందుకే ఈ గ్రామాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. మానికొండ--తరిగొప్పల రోడ్డుతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి మొత్తం రూ.3.45 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో రూ.2.50 కోట్లతో అధ్వానంగా ఉన్న రహదారిని 10 రోజుల్లో ప్రారంభిస్తామనీ, మరో రూ.95 లక్షలతో నందమూరు రోడ్డును నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో 60 వేల మందికి ఇంటి వద్దే రక్త పరీక్షలు నిర్వహించామని, రైతులకు ఇచ్చే పట్టాదారు పాస్ పుస్తకాలలో లోపాలను సరిచేసి, రాష్ట్ర రాజముద్రతోనే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ఉంగుటూరు మండల అధ్యక్షులు కొలుసు రవీంద్ర, రాష్ట్ర టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్నా, మానికొండ గ్రామ టిడిపి అధ్యక్షులు యడ్లపల్లి సాయిబాబు, మానికొండ పిఏసిఎస్ చైర్మన్ అరికట్ల రవి, కుందేటి చంద్రశేఖర్, గొడ్డళ్ల చిన్న రామారావు, బెజవాడ నాగేశ్వరరావు, చింత వాసుబాబు, కొండేటి వెంకటేశ్వరరావు, అరుమళ్ళ కృష్ణారెడ్డి, మేడేపల్లి రమ, తుమ్మల లత, దాసరి రవళి, కొసరాజు సాయి, షేక్ ఫిరోజ్, షేక్ అజీజ్, విష్ణు, పొట్లూరి భువనేశ్వరి, రాజబోయిన శివాజీ, యర్రగుంట్ల వినోద్, కొమ్మారెడ్డి రాజేష్, బోడపాటి రవి, తిరువీధి నరేష్, వేలమర్తి రాజు, లంకా సత్తిరాజు, గుడ్డేటి అనిల్, ఉయ్యూరు మురళి, తోటా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు అందించే ఉచిత ఇసుకను ఇతర పనులకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..

**ఆసిఫాబాద్, మార్చి 25 :(వార్తా ప్రభ ప్రతినిధి)** :: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అందిస్తున్న ఉచిత ఇసుకను ఇతర పనులకు తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరిత అన్నారు. బుధవారం కెరమెరి మండలంలోని అనార్ పల్లి ఎక్స్ రోడ్డు వద్ద భారీ సంఖ్యలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను, ఆపి రశీదులను పరిశీలించి ఎక్కడి నుండి ఇసుకను తరలిస్తున్నారని, ట్రాక్టర్ డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు, జైనూర్ కెరమెరి తహసిల్దారుకు, ఛరవాణి ద్వారా సమాచారం అందించి, వెంటనే రసీదులను పరిశీలించాలన్నారు.

# నీటి వృధాను అరికట్టడం మనందరి బాధ్యత - ఎంపీడీవో బి.వి.రామకృష్ణ నాయక్

-నీటి సంరక్షణ పై అవగాహన కల్పించిన ఎంపీడీవో




**జి.కొండూరు,మార్చి 25 (వార్తాప్రభ) :** నీరు జీవకోటికి ఆధారమని, భవిష్యత్తును నిర్ణయించే శక్తి అని, నీటి వృధాను అరికట్టడం మనందరి బాధ్యత అని ఎంపీడీవో బి.వి.రామకృష్ణ నాయక్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సభా మందిరంలో మండల, గ్రామస్థాయి అధికారులకు వెలుగు వివోఏ లకు నీటి సంరక్షణ పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పెరుగుతున్న అవసరాల దృష్ట్యా నీటిని వృధా చేయకుండా అత్యంత బాధ్యతాయుతంగా వాడాలని సూచించారు. ముఖ్యంగా లీకేజీలు, నిర్లక్ష్యంతో నీటి వృధా అవుతుందని తెలిపారు. విలువైన నీరు చాలా వరకు వృధాగా పోతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాత పైపులైన్ల వ్యవస్థ, లీకేజీలు, ఇంటి ముందు రహదారులపై వాహనాలు నిలిపి పైపులు పెట్టి కడగటం, పబ్లిక్ కుళాయిలకు ట్యాప్లు లేకపోవడం తదితర కారణాలతో నీరు ఎక్కువ వృథాగా పోతోంద న్నారు. ప్రధానంగా దీనిపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. బ్రష్ చేసేటప్పు డు, స్నానం చేసేటప్పుడు, పాత్రలు కడిగేటప్పుడు కుళాయిలను కట్టివేయడం, లీకేజీలను వెంటనే రిపేర్ చేయడం, మరియు వాన నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా నీటిని ఆదా చేయవచ్చు అన్నారు. చిన్న చిన్న మార్పుల తో పెద్ద మార్పును తీసుకురావచ్చని వెల్లడించా రు. ఏ వస్తువు అయినా ఉచితంగా లేదా ఎక్కువ మొత్తంలో అందుబాటులో ఉంటే దుర్వినియోగం చేయడం మానవ నైజమని అన్నారు. వేసవి కాలం వచ్చేసిందని, సహజంగానే నీటి వాడకం ఎక్కువ అవుతుందని, బోర్ల నుంచి, కుళాయిల నుంచి వస్తున్న నీటిని విచ్చలవిడిగా వాడుతున్నారే తప్పా ఏనాడైనా నీటి పొదుపు గురించి ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లు ఏటుకూరి బసవలింగేశ్వరరావు, ఎం. స్వరూప రాణి పాల్గొన్నారు.

# నియోజకవర్గ రైతు సమస్యలను పరిష్కరించండి

● అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రానా శేఖర్ కు వినతి ● రాష్ట్ర విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,మార్చి 25 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం వెలగపూడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలోని నాలుగవ బ్లాక్‌లో అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రానా శేఖర్ని కలిసి నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. నందిగామ, కంచికచర్ల మార్కెట్ యార్డ్‌లలోని మార్క్‌ఫెడ్ సెంటర్ కింద కొనుగోళ్ల కేటాయింపులు కోరారు మొక్కజొన్న (మైజ్): 15,000 మెట్రిక్ టన్నుల కొనుగోలు కేటాయింపు. బెంగాల్ గ్రామ్ (శనగలు): 10,252 మెట్రిక్ టన్నుల కొనుగోలు కేటాయింపు. గ్రీన్ గ్రామ్ (పెసలు): 300 మెట్రిక్ టన్నుల కొనుగోలు కేటాయింపు. నియోజకవర్గంలోని మొక్కజొన్న, శనగలు, పెసలు పంటలు పండించే రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ధరల సమస్యలు, మార్కెటింగ్ ఇబ్బందులు మరియు సకాలంలో కొనుగోళ్ల లోపం వంటి అంశాలపై ఆమె వివరంగా వినతి పత్రం ద్వారా రైతుల సమస్యలు తెలియజేశారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ రానా శేఖర్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వినతిని సానుకూలంగా స్వీకరించారు. మొక్కజొన్న సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని, పెసలు మరియు శనగలు విషయాలను సంబంధిత శాఖ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశం రైతుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. నందిగామ నియోజకవర్గ రైతులు తమ పంటలకు సకాలంలో, సరైన ధరలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు.

# లేపాక్షి రాయితీ అమ్మకాలకు విశేష స్పందన

## మరో ఐదు రోజులు మాత్రమే గడువు

**విజయవాడ,మార్చి 25 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లేపాక్షి) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న క్లియరెన్స్ సేల్‌కు హస్తకళల ప్రేమికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో వినియోగదారులు ఆసక్తిగా కొనుగోళ్లు చేస్తున్నారు. ఎంపిక చేసిన ఉత్పత్తులపై గరిష్ఠంగా 50 శాతం వరకు రాయితీ అందుబాటులో ఉండటంతో అన్ని షోరూమ్‌లలో సందడి నెలకొంది. మార్చి 1న ప్రారంభమైన ఈ వార్షిక సేల్ మార్చి 31 వరకు అన్ని లేపాక్షి షోరూమ్‌లలో కొనసాగుతోంది. సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే నిర్వహించే ఈ రాయితీ అమ్మకాలను వినియోగించుకునేందుకు వినియోగదారులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ సేల్‌లో కొండపల్లి బొమ్మలు, ఎటికొప్పాక కళాఖండాలు, చెక్క శిల్పాలు, కలంకారి చీరలు, బొబ్బిలి వీణ, కంచు విగ్రహాలు, రాయి శిల్పాలు, తోలుబొమ్మలాట కళాఖండాలు, పెన్ కలంకారి, సవారా ఆదివాసి చిత్రాలు, బుడిది పిత్తళి వస్తువులు వంటి విభిన్న హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, కర్నూలు, రాజమండ్రి, అనంతపురం, హైదరాబాద్ తదితర నగరాల్లోని లేపాక్షి షోరూమ్‌లలో కొనుగోలు దారుల రద్దీ కనిపిస్తోంది. హస్తకళాకారులకు మద్దతు ఇవ్వడం, సాంప్రదాయ కళలను పరిరక్షించడం, సంప్రదాయ నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లేపాక్షి చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎండీ విశ్వ మనోహరన్ తెలిపారు. సేల్ ముగియడానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో మరింత మంది వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఘనంగా భాజపా ప్రశిక్షణా కార్యక్రమం



**అమలాపురం,మార్చి 25 (వార్తాప్రభ) :** పట్టణంలో భారతీయ జనతా పార్టీ ప్రశిక్షణా కార్యక్రమం కిరాణా మర్చంట్ హాల్ లో పట్టణ అధ్యక్షులు, అయ్యల భాషా ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిలుగా జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1951 వ సంవత్సరంలో భారతీయ జన సంఘ్ పార్టీగా మొదట శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్థాపించారని, అనంతరం జరిగిన పరిణామాలలో 1980, ఏప్రిల్ 6 వ తేదీన భారతీయ జనతా పార్టీగా ఆవిర్భవించిందని అన్నారు. 1990 సంవత్సరం నుండి బలమైన రాజకీయ శక్తిగా ఎదిగి అటల్ బిహారీ వాజ్ పేయి నేతృత్వంలో మొదటి సారి 1996 లో మొదటిసారి అధికారం చేపట్టిందన్నారు. భాజపా ప్రస్థానం మొదలైంది అని అన్నారు. అనంతరం పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి, వాటిని ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. ఏప్రిల్ 6 వ తేదీన జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలని, అలాగే ఏప్రిల్ 14న జరిగే రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అమెరికా, ఇజ్రాయిల్- ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో హర్ముజ్ జలసంధి ద్వారా మన దేశానికి గ్యాసు, చమురులను రప్పిస్తున్న నరేంద్ర మోదీ చతురత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకరమిల్లి శ్రీనివాసరావు, సలాది వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, చిలకమర్రి కస్తూరి, మాలే శ్రీనివాస్ నగేశ్, మాజీ పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, మైనారిటీ మోర్చా అధ్యక్షులు సంషూ సాద్విక్ , జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు, సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, జిల్లా కార్యాలయ ఇంచార్జి డీవిఎస్ రాజు, చిట్టూరి రాజేశ్వరి, గోకరకొండ గంగన్న స్వామి, కొండేటి జయలక్ష్మి, పావులూరి వెంకట్, పలువురు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ చేస్తున్న సర్పంచ్ లకు సత్కారం



**పెడన,మార్చి 25 (వార్తాప్రభ) :** త్వరలో పదవీ విరమణ చేయబోతున్న సర్పంచులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సత్కారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్ లు ఐదు సంవత్సరాల తమ అనుభవాలను వెల్లడించారు. ఎంపీపీ రాజులపాటి వాణి జడ్పిటిసి అర్జా నగేష్ మండల పరిషత్తు ప్రత్యేక ఆహ్వానితుడు రాజులపాటి అచ్యుతరావు మండలంలోని సర్పంచులు గరికపాటి రామానాయుడు గాజుల శ్రీనివాసరావు కాగిత విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో రహదారులు నిర్మించాలి



**కోడూరు,మార్చి 25 (వార్తాప్రభ) :** నాణ్యతా ప్రమాణాలతో రహదారులు నిర్మించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఉపాధి హామీ పథకం నిధులతో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కోడూరులో రూ. 42 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టిన రహదారులను పరిశీలించారు. కోడూరు అయ్యప్ప స్వామి దేవాలయం రహదారి, కోడూరు ఎస్సీ వాడ నుంచి ముందడుగు వెళ్ళు రహదారి నాణ్యతను పరిశీలించారు. రహదారులను నిబంధనలకు అనుగుణంగా కలకాలం మన్నేలా నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ వయసు పెంపు నిర్ణయంపై కృతజ్ఞతలు

● ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల ఉద్యోగుల తరఫున ధన్యవాదాలు ● పీఆర్‌సీ కమిటీ నియామకంపైనా త్వరితగతిన నిర్ణయం తీసుకోండి ● కమిషన్ ఏర్పాటులో జాప్యంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం ● పదవి విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరితగతిని చెల్లించాలి ● మంత్రి నారా లోకేష్‌ను కలిసిన ఎ. విద్యాసాగర్, జేఏసీ నేతలు




**అమరావతి, మార్చి 25 (వార్తాప్రభ) :** ప్రభుత్వరంగ సంస్థలు, గురుకులాల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ మంత్రుల బృందం (జీవోఎం) తీసుకున్న సానుకూల నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ మంత్రి నారా లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఉద్యోగులకు ఆర్థిక భద్రతను కల్పించడమే కాకుండా, వారి సేవలను మరింత కాలం వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్యాసాగర్ నేతృత్వంలోని జేఏసీ, ఎన్‌జీజీవో నేతలు బుధవారం మంత్రి నారా లోకేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. జీవోఎంలో సభ్యునిగా సానులకూల నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. మహిళా ఉద్యోగులకు సంబంధించిన చైల్డ్ కేర్ లీవ్ ఓయో పరిమితి నిబంధన సడలించటం మహిళా ఉద్యోగులందరికీ ఆనందదాయకంగా ఉందని మహిళ ఉద్యోగ సంఘాల నాయకులు మంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కొక్కటిగా పరిశ్రమల తరలివస్తున్నాయని, ముఖ్యంగా 1,26 వేల కోట్లు ఏర్పాటు చేయబోయే మిట్టల్ ఉక్కు కర్మాగారం రాష్ట్రానికి తలమానికంగా ఉంటుందని, దీనికి విశేష కృషి చేసిన మంత్రి నారా లోకేష్ గారికి జోక సంఘాల నేతలు అభినందనలు తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన కీలక అంశమైన పీఆర్సీ కమిటీ నియామకంపైనా ప్రభుత్వం దృష్టిసారించాలని.. కమిషన్ ఏర్పాటు జాప్యం కారణంగా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పీఆర్సీ కమిటీని వీలైనంత త్వరగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దశాబ్దాల తరబడి సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించిన గ్రాట్యుటీ, సరెండర్ బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా సర్వీసులో ఉన్న ఉద్యోగులకు సరెండర్ బిల్లుల చెల్లింపులు జరగకపోవడం వల్ల వారిలో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి బకాయిలు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెకండరీ ఎడ్యుకేషన్, హైయర్ ఎడ్యుకేషన్ తదితరు డిపార్ట్మెంట్లో ఎయిడెడ్ సంస్థల నుంచి వచ్చిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ తయారు చేయాలని, తద్వారా ప్రమోషన్ లభిస్తాయని కోరారు. మంత్రి నారా లోకేష్ ను కలిసిన వారిలో ఎ పి ఎన్ జి జి ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎ విద్యాసాగర్ తో పాటు జే ఏ సి రాష్ట్ర సెక్రెటరీ జనరల్ కె ఎస్ ఎస్ ప్రసాద్, ఎన్ జి జి ఓ రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి డివి రమణ కార్యవర్గ సభ్యులు కె. జగదీశ్వరరావు ఎన్. భారతి ప్రసాద్ జి. శ్రీనివాస్ ఆర్ ఎస్ హరనాథ్ బి. జానకి ఎం. సరస్వతి ఎం. రాజ్యలక్ష్మి పి. సురేఖ షేక్ జాని ఫాషా తదితరులు ఉన్నారు.

# రామవరపు మోడీ లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంఎల్ఏ కృష్ణ ప్రసాద్....



**కృత్తివెన్ను,మార్చి 25 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం రామవరపుమోడీ గ్రామంలో బుధవారం నాడు 35.00 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్. రామవరపుమోడీ గ్రామంలో గ్రీన్ కో కంపెని ( సి ఎస్ ఆర్ ) నిధులు 15.00 లక్షలు వ్యయంతో వాటర్ పైప్ లైన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని అనంతరం 20.00 లక్షల వ్యయంతో 3 ఫేస్ కరెంట్ సప్లైను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన ఎంఎల్ఏ కృష్ణ ప్రసాద్. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

# ఉపాధి హామీ పనిని 125 రోజులకు పెంచిన కేంద్ర ప్రభుత్వం



**కోడూరు, మార్చి 25 (వార్తాప్రభ) :** భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన వి బీజీ రాంజీ వికసిత్ భారత్ పనికి ఉపాధి హామీ కార్యక్రమం వందరోజుల నుండి 125 రోజులకు పెంచడం జరిగిందని వి బి జి రాంజీ కృష్ణాజిల్లా కన్వీనర్ జీవి నగరాయులు తెలిపారు. బుధవారం నాడు కోడూరు మండల పరిధిలోని లింగారెడ్డి పాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను భారతీయ జనతా పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాయలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రజా సంక్షేమ కోసం అనేక సంక్షేమపథకాలను అమలు చేస్తున్నారని, ఏప్రిల్ ఒకటో తేదీ నుండి వంద రోజులు పనిని 125రోజుల పనిగా చట్టబద్ధత కల్పిస్తున్నారని ఈ సందర్భంగా పథకం ప్రయోజనాలను ఉపాధి హామీ కార్మికులకు తెలియజేయడంతో పాటుఈ ఈ పథకం కార్మికులకు, గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోబీజేపీ సీనియర్ నాయకులు కొండవీటి రామకృష్ణ, నియోజకవర్గ కిసాన్ మోర్చా నాయకులు భూపతి సుబ్రహ్మణ్యం తో పాటు పలువురు నేతల పాల్గొన్నారు.

# ఒమ్మంగిలో రామాలయ ప్రతిష్టలో పాల్గొన్న ముదునూరి

-ఆలయానికి రూ. లక్ష విరాళం



**ప్రత్తిపాడు,మార్చి 25 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో నూతనంగా పునః నిర్మించిన రామాలయంలో శ్రీ శ్రీ శ్రీ రామచంద్ర మూర్తి స్వామి వారి విగ్రహా ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన వైసీపీ నరసాపురం పార్లమెంట్ పరిశీలికులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజుకి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయన స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణంరాజు మీడియాతో మాట్లాడుతూ ఏడాది పాటు రామాలయాన్ని పునః నిర్మించడానికి కృషి చేసిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. తన వంతు సహాయంగా ఒక లక్ష రూపాయలు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేస్తున్నానన్నారు. భవిష్యత్తులో ఈ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

# మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ హుండీ ఆదాయం రూ. 89,17,515 లు..

-బంగారం, వెండి, విదేశీ కరెన్సీ అధనం.



**మోపిదేవి/అవనిగడ్డ,మార్చి 25 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా, మోపిదేవిలో స్వయంభువుగా కొలువుదీరిన శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ హుండీలు బుధవారం లెక్కించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో, మచిలీపట్నం డివిజన్ తనిఖీ అధికారి కె. శ్రీనివాసరావు , భోగిరెడ్డిపల్లి శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్. అరుణ పర్యవేక్షణ లో హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. 76 రోజుల కాలానికి సంబంధించిన హుండీల లెక్కింపు ప్రకారం రూ. 89,17,515/- నగదు ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా హుండీల ద్వారా వెండి : 1 కిలో 686 గ్రాములు బంగారం : 44 గ్రాములు 004 మిల్లీగ్రాములు, విదేశీ కరెన్సీ : అమెరికా డాలర్లు 129, ఇంగ్లాండ్ కరెన్సీ 5 ఆస్ట్రేలియా కరెన్సీ 20 స్వామి వారికి హుండీ ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు , ఆలయ సిబ్బంది, మోపిదేవి స్టేట్ బ్యాంక్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, గ్రామస్థులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# మోపిదేవి స్వామివారిని దర్శించుకున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, రైల్వే కోడూరు ఎంఎల్అరవ శ్రీధర్...




**మోపిదేవి/అవనిగడ్డ,మార్చి 25 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా మోపిదేవిలో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఎపిఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేశారు. ఇదే విధంగా రైల్వే కోడూరు ఎంఎల్ఏ అరవ శ్రీధర్ బుదవారం దర్శించుకున్నారు. స్వామి వారి నాగ పుట్టలో పాలు పోసి మొక్కుబడులు చెల్లించుకున్న అనంతరం ఆయన గర్భాలయంలో కొలువుదీరిన శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు ఆయనకు శ్రీ స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయం - చెవుటూరు
## జి.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
### టెండరు ప్రకటన

తేది.26-03-2026

ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, చెవుటూరు గ్రామ పంచాయితీ నందు ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు గాను ఒక సంవత్సరమునకు అనగా ది.01-04-2026 నుండి 31-03-2027 వరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు ది. 30-03-2026 మధ్యాహ్నం 12.00 గంటల వరకు స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును. ఇతర వివరములు కొరకు కార్యాలయము పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ. సంఖ్య | పని పేరు | కాలము | టెండరు ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పారిశుధ్య పనులు - 01 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 1x500/- |
| 2) | ట్యాంకు ఆపరేటర్ - 02 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 2x500/- |
| 3) | వీధి దీపముల రిపేరు (ఎలక్ట్రీషియన్) - 01 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | 1x500/- |

నోట్ :-
1. గతంలో గ్రామ పంచాయితీలో పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
2. పంచాయితీ నిధులు నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును.

**సం/- పిన్నిబోయిన శ్రీదేవి**
సర్పంచ్
గ్రామ పంచాయతీ, చెవుటూరు
జి.కొండూరు మండలం.

**సం/- డి.రమాదేవి**
కార్యదర్శి
గ్రామ పంచాయతీ, చెవుటూరు
జి.కొండూరు మండలం.

## గ్రామ పంచాయితీ కార్యాలయం, కోకనారాయణపాలెం
### టెండరు ప్రకటన

తేది.25.03.2026

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, కోకనారాయణపాలెం గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2026-27 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2026 నుండి 31.03.2027 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును. సదరు టెండర్లు ది.28.03.2026 వ తేది మధ్యాహ్నం 1.00 గం,లకు వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 1.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంక్ ఆపరేటర్గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రం |
| 2) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రం |
| 3) | స్వీపర్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రం |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

**సం/- శ్రీమతి బండి అంజలి కుమారి**
సర్పంచ్
గ్రామ పంచాయితీ -కోకనారాయణపాలెం

**సం/- శ్రీమతి అంబటి దివ్య**
కార్యదర్శి
గ్రామ పంచాయితీ -కోకనారాయణపాలెం

## గ్రామ పంచాయితీ కార్యాలయం, నారికేడలపాలెం
### టెండరు ప్రకటన

తేది.25.03.2026

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, నారికేడలపాలెం గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2026-27 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2026 నుండి 31.03.2027 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును. సదరు టెండర్లు ది.28.03.2026 వ తేది మధ్యాహ్నం 1.00 గం,లకు వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 1.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంక్ ఆపరేటర్గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రం |
| 2) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రం |
| 3) | స్వీపర్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రం |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

**సం/- శ్రీమతి జంపన రమాదేవి**
సర్పంచ్
గ్రామ పంచాయితీ -నారికేడలపాలెం

**సం/- శ్రీమతి అంబటి దివ్య**
కార్యదర్శి
గ్రామ పంచాయితీ -నారికేడలపాలెం

## గ్రామ పంచాయితీ కార్యాలయం, తుమ్మలపాలెం
### టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.నిల్/2026 తేది.25-03-2026

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, తుమ్మలపాలెం గ్రామ పంచాయితీలో ఒక సంవత్సర కాలం 2026-27 ఆర్థిక సంవత్సరమునకు అనగా (ది.01.04.2026 నుండి 31.03.2027 వ తేది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయం పనిచేయు వేళలో తెలుసుకొనవచ్చును.సదరు టెండర్లు ది.28.03.2026 వ తేది మధ్యాహ్నం 1.00 గం,లకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గానీ,వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 1.30 గం,లకు హాజరైన టెండరుదార్ల సమక్షంలో తెరువబడును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ఎలక్ట్రీషియన్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |
| 2) | ట్యాంకు ఆపరేటర్ గా పనిచేయుటకు ఒక వ్యక్తి సేవలు | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ.1000/- |

నోట్ :-
1. గతంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును

**సం/- కోడె రేణుకా దేవి**
సర్పంచ్
తుమ్మలపాలెం గ్రామ పంచాయితీ

**సం/- ఎ.మణి**
కార్యదర్శి
తుమ్మలపాలెం గ్రామ పంచాయితీ

## వీలునామా దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, రథాల పేట, హౌస్ నెంబర్ 11-3-65 కాపురస్తులు కీర్తిశేషులు ఏ అప్పన్న గారి కుమారుడైన ఏ.వి. అప్పారావు అను నాకు నా తల్లి గారు శ్రీమతి ఏ.నూకాలమ్మ గారు 16.03.2020 న పైన ఉదాహరించిన ఇంటి నెంబర్ కు సంబంధించి వ్రాసిన వీలునామా దస్తావేజులు కలిగిన కవర్ 21-03-2026 న కాకినాడ నుంచి పిఠాపురం కు బస్సులో వెళ్ళుతుండగా జారీ పడిపోయినవి. వెంటనే పరిసర ప్రాంతాలలో వెతికిన కనిపించలేదు. సదరు వీలునామా పత్రాలు ఎవరైనా ఉపయోగించిన, ఎవరైనా ఇటువంటి అన్యక్రాంతములు జరిపిన చట్ట ప్రకారం తీసుకునే యావత్ చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేస్తూ... ఎవరికైనా మా తల్లిగారు శ్రీమతి ఏ.నూకాలమ్మ వ్రాసిన వీలునామా పత్రాలు దొరికిన యెడల నాకు తెలియపరిచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**సెల్ : 6305472567**

## ఇంటి పన్ను చెల్లించని యజమానికి జప్తు నోటీసు అందజేత

● 3 రోజులలో ఇంటి పన్ను చెల్లించాలని నోటీసు జారీ చేసిన డిప్యూటీ ఎంపీడీవో ఏటుకూరి



**జి.కొండూరు,మార్చి 25 (వార్తాప్రభ) :** గత నాలుగేళ్లుగా ఇంటి పన్ను చెల్లించకపోవడంతో ఆ ఇంటి యజమానికి ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో వై.బసవ లింగేశ్వర రావు గ్రామ సచివాలయం సిబ్బందితో కలిసి బుధవారం జప్తు నోటీసు అందజేశారు.ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు గ్రామంలోని ఇంటి నెంబర్ 10-94 (అసెస్మెంట్ నెం :1894) యజమాని 2022 నుంచి 2026 సంవత్సరాలకు కలిపి ఇంటి పన్ను మొత్తం రూ. 1,03,253 లు చెల్లించాల్సి ఉందని, ఇప్పటి వరకు ఇంటి పన్ను చెల్లించలేద ని, అనేక సార్లు ఇంటి పన్ను డిమాండ్ నోటీసు అందజేశామని అయినప్పటికీ ఆ ఇంటి యజమాని వెంకటేశ్వరరావు స్పందించలేదని డిప్యూటీ ఎంపీడీవో బసవలింగేశ్వర రావు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు జప్తు నోటీసు జారీ చేశామ న్నారు.ఇంటి పన్ను చెల్లించనియెడల 1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టములోని సెక్షన్ 60,61, 268, 269 అనుసరించి మరియు సెక్షన్ 268లోని షెడ్యూలు-1 నందలి 25 నుంచి 36 క్లాజుల క్రింద ఇంటి యజమానిపైన కోర్టులో ప్రాసిక్యూషన్ వేయబడునని తెలియజేశారు.

## పంచాయితీ నిధుల పేమెంట్స్ ఆపేయండి



**జి.కొండూరు,మార్చి 25 (వార్తాప్రభ) :** పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ నిధులకు సంబంధించిన పేమెంట్స్ ఆపేయాలని ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో ఏటుకూరి బసవలింగేశ్వర రావు అన్ని గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.సర్పంచ్ ల వత్తిడి మేరకు సెక్రెటరీ లు పంచాయితీ నిధులు మొత్తం డ్రా చేస్తున్నా రని గుర్తించిన కమిషనర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బసవలింగేశ్వరరావు కార్యదర్శుల కు సూచించారు.ఈ సొమ్ము ఏడాది మొత్తం జీతాలు ఖర్చులకు ఉంచాలని తెలిపారు. అయితే జెన్యూన్ బిల్లులు ఉంటే డి ఎల్ డి వో ద్వారా వెరిఫికేషన్, సంతకం చేసిన తరువాత మాత్రమే నిధులు డ్రా చేయాలని తెలియజేశారు. ఆస్తి, నీటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని కూడా డిప్యూటీ ఎంపీడీవో కార్యదర్శిలకు సూచించారు.

# విద్యా ప్రమాణాలను మెరుగుపర్చండి

● పెనుమల్లి లో ఉపాధ్యాయులను ఆదేశించిన కలెక్టర్ డీకే బాలాజీ





**పెడన,మార్చి 25 (వార్తాప్రభ) :** విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ పెడన మండలంలోని పెనుమల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించి ఒకవైపు ఇంటింటికి తిరిగి 9 వ తరగతి చదువుతున్న విద్యార్థుల స్థితిగతులను ఆరా తీశారు. మరోవైపు స్వామిత్వ సర్వే వివరాలను పరిశీలించారు. తొలుత జిల్లా కలెక్టర్ పెనుమల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి 9 వ తరగతి చదువుతూ 10వ తరగతికి వెళుతున్న విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ఉన్నత పాఠశాల లో ప్రత్యేకించి ఏర్పాటుచేసిన బ్రిడ్జి కోర్సు ఏ విధంగా ఉపయోగించుకు ంటున్నారో విచారించారు. జిల్లా కలెక్టర్ గ్రామంలో 9 వ తరగతి చదివిన నిడుమోలు రాగ ఉషా లత బ్రిడ్జ్ కోర్స్ ఎలా చదువుకుంటుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ అమ్మాయి తాను తెల్లవారుజాము ననే లేచి చదువుకుంటున్నానని, 10 తరగతిలో తనకు 550 మార్కులు రావాలని లక్ష్యంతో చదువుకుంటున్నానని, రానున్న రోజుల్లో 580 మార్కులు లక్ష్యంగా పెట్టుకుంటానని భవిష్యత్తులో లోకో పైలట్ కావాలని కోరిక ఉందని జిల్లా కలెక్టర్కు వివరించారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ఎందుకు అంత తక్కువ లక్ష్యం పెట్టుకుంటావని అంటూ మొదటి నుండే 590 మార్కులు సాధించాలని లక్ష్యం పెట్టుకుని అందుకు అనుగుణంగా ప్రయత్నించా లన్నారు. పాఠశాలలో చెప్పే పాఠం గురించి ముందుగానే పాఠ్యపుస్తకం లో చదువుకొని పాఠశాలకు వెళ్లాలని, ఆ తర్వాత అదే పాఠాన్ని మరల ఇంటి వద్ద ఒకసారి చదువుకోవాలన్నారు. ఆ విధంగా చదవడం వల్ల వారికి పాఠాలు బాగా గుర్తుంటాయన్నారు. తదుపరి కలెక్టర్ గ్రామంలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థిని కాగిత లాస్య ఎలా చదువుకుంటున్నావని, ఏమవుతావని ప్రశ్నించగా తాను బాగా చదువుకుంటున్నానని,డాక్టర్ అవుతానాని కలెక్టర్ కు చెప్పారు. ఆహారం బాగా తినాలని పాఠశాలలో చిక్కి కోడిగుడ్డు ఇస్తున్నారా తింటున్నావా, రాగిజావ తాగుతున్నావా అని ప్రశ్నించగా ఆ అమ్మాయి అన్నిటికీ అవునని చాలా స్మార్ట్ గా సమాధానాలు చెప్పడంతో జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇలాంటి పిల్లలు ఏ కారణం చేతనైనా చదువు మధ్యలో ఆపివేస్తే వారు జీవితాంతం వెనకబడిపోయి బాధపడతా రన్నారు. ఇటువంటి వారికి బాగా చదివించాలనీ, కనీస స్థాయి పరిజ్ఞానం తెలుసుకోవాలన్నారు. మూడు నాలుగు నెలల తర్వాత మరల వస్తానని అప్పుడు అన్ని చదివి వినిపించాలని కలెక్టర్ విద్యార్థినికి తెలిపారు. గ్రామంలో గుర్తించిన నిర్మాణ వాలంటీర్లతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులందరికీ ఒకే విధంగా చదువు చెబుతూ ఉంటారని ఒక్కసారి అర్థం కాక వెనుకబడితే అలాగే జీవితాంతం వెనుకబడిపోతారన్నారు. అటువంటి వారికి ధైర్యం చెప్పి సరైన విధంగా ప్రోత్సహిస్తే చదువులో ముందుకు సాగుతార న్నారు. చాలామంది విద్యార్థులు పరీక్షలు దగ్గర పడినప్పుడు చదువుతు ంటారని అలా కాకుండా ముందు నుంచే చదువుకుంటే ధైర్యంగా బాగా పరీక్షలు రాయవచ్చన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పెనుమల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడి స్వమిత్వా రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో రోవర్సు పాయింటు సరిగా ఉందో లేదో కూడా పరిశీలించారు. రెండుమూడు వీధులు తిరిగి ఇళ్ల కొలతలు సరిగా ఉన్నాయా లేదా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామపంచాయతీ పన్నులు, పన్నేతర లావాదేవీలు నగదు రహితంగా చెల్లింపు ఏ విధంగా చేస్తున్నారో గమనించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు రాకుండానే స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఆన్లైన్ ద్వారా పన్నులన్నీ ఇంటి వద్ద నుంచే చెల్లించే అవకాశం ఉందన్నారు. అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తదనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో సమిత్వా సర్వే జరుగుతుందని, సర్వే ద్వారా గ్రామ కంఠంలో ఉన్న ఇంటింటికి తిరిగి ఆస్తి హక్కు కార్డులు ఇచ్చారా లేదా సర్వే సరిగా చేశారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం పర్యటిస్తున్నామన్నారు. పెనుమల్లి గ్రామపంచాయతీలో నూటికి నూరు శాతం ఆస్తి పన్నులు వసూలు చేసినందుకు సిబ్బందిని అభినందిస్తున్నామన్నారు. ఈ పర్యట నలో కలెక్టర్ వెంట సర్వే భూ రికార్డుల ఏడి లక్ష్మణ్ బాబు డి ఎల్ డి ఓ పద్మ, డి ఎల్ పి ఓ రజావుల్లా తహసిల్దారు అనిల్ కుమార్ ఎంఈఓ లు హరినాథ్ సలోమి, సర్పంచ్ రామానాయుడు, జడ్పిటిసి ఆర్జా వెంక ట నగేష్ సర్పంచ్ గరికపాటి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆకులమన్నాడు లో రైతన్నా..మీకోసం



**పెడన,మార్చి 25 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం ఆకులమన్నాడు గ్రామంలో 'అన్నదాత సుఖీభవ'3 విడత రైతుల ఖాతాలలో నగదు జమైన సందర్భంగా "రైతన్న! మీకోసం" అనే డోర్ టు డోర్ విజిట్ కార్యక్రమంలో పాల్గొన్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అర్హత కలిగిన రైతుల ఖాతాల్లోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు విడతలుగా 20 వేలు ఆర్థిక సహాయం జమ చేసిందని తెలిపారు. ఈ సహాయం రైతులకు పంటల సాగు ఖర్చులను తగ్గించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మరింత అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్లి రైతులు మరియు గ్రామస్తులతో మాట్లాడి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోపి నాగబాబు ప్రధాన కార్యదర్శి తోట వేణు సర్పంచ్ మహమ్మద్ రఫీ పిఎసిఎస్ అధ్యక్షులు ఎజ్జు శివాజీ, కూటమి నాయకులు కాస గాని శ్రీనివాసరావు కోలపల్లి రజిని ఎన్ ఏ బేగ్ నాగిశెట్టి నాగబాబు కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు సమ్మెట రాఘవ ప్రసాద్ సుంకర రవి బత్తిన వీరబాబు అగ్రికల్చర్ ఏవో రామకృష్ణ కూనపరెడ్డి పెద్దిరాజులు సిరివెళ్ల శ్రీను జన్ను ప్రసాద్ పుప్పాల సురేష్ కాట్రగడ్డ సత్యనారాయణ కట్రెడ్డి నాగ మురళి హరికృష్ణ, సిరివెళ్ల సుబ్రహ్మణ్యం గొరిపర్తి చంద్రశేఖర్ మురాల ధనుష్ హాఫిజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొర్లపాడు అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి యాదవసంఘం చేయూత



**పెడన,మార్చి 25 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం కొర్లపాడుగ్రామంలోగత ఆదివారం యలవర్తి ఏడుకొండలు తాటాకు ఇల్లు గేదల చావిడి షార్టుసర్క్యూట్ వల్ల అగ్నికి ఆహుతి అయి సుమారుగా 4లక్షల ఆస్తినష్టం జరిగింది. ఈవిషయం గురించి నియోజకవర్గం యాదవులు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ కొలుసు చందుయాదవ్ తెలుసుకుని వెంటనే స్పందించి పెడన గ్రూప్ లో సహకారం కోసం పిలుపు నిచ్చారు. గ్రూప్ లో సభ్యులు స్పందించారు. బోయిన నాగరాజు నూనె కళ్యాణ్ ఆధ్వర్యంలో బోయిన సురేష్ పెడన నియోజకవర్గం యాదవుల అందరూకలిసి గ్రూప్ ద్వారా అమౌంట్ సేకరించి 20 వేల నగదు నిత్యసరసరుకులు వంటసామగ్రి దుప్పట్లు అన్నికలిపి నాలుగు మండలాల యాదవ పెద్దలు గ్రామపెద్దలు ఏడుకొ ండలు కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి మేము ఉన్నాం అంటూ భరోసాను అందచేశారు.. ఈకార్యక్రమంలో బంటుమిల్లి మండల యాదవపెద్దలు గౌరీబాల బోయినసాంబయ్య బోడావుల గాంధీ చేబోయిన సముద్రయ్య గెద్దం ఆదియ్య మాగంటి గంగరాజు మాగంటి కనక చింతయ్య యాదవ యువత బోయిన నాగరాజు నూనె కళ్యాణ్ దోడాకుల సాయి బోయిన బాలాజీ గ్రామా పెద్దలు మరియు నాలుగు మండలాల యాదవులు పాల్గొన్నారు....

## గ్రామాభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్ర మరువలేని-సర్పంచ్ రవీంద్ర కుమార్

-వార్డు సభ్యులను ఘనంగా సన్మానించిన సర్పంచ్ ప్రత్తిపాటి

**జి.కొండూరు,మార్చి 25 (వార్తాప్రభ) :** గడ్డమణుగు గ్రామాభివృద్ధిలో పాలకవర్గ సభ్యుల పాత్ర మరువలేనిదని ఆ గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి రవీంద్ర కుమార్ అన్నారు.జి.కొండూరు మండల పరిధిలోని గడ్డమణుగు గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ రవీంద్ర కుమార్ అధ్యక్షతన గ్రామపంచాయతీ సాధారణసమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గడచిన ఐదేళ్ల కాలంలో పాలకవర్గ సభ్యుల భాగస్వామ్యంతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు.ఏప్రిల్ 2వ తేదీతో పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగుస్తుందని, సహకరించిన వార్డు సభ్యులకు రవీంద్ర ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సర్పంచ్ వార్డు సభ్యులను సన్మానిం చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొమరగిరి పులి గంగాధరరావు,గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి - ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

**పెడన,మార్చి 25 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ. 12,61,099 లక్షల రూపాయల సహాయ నిధి చెక్కులను లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిదిని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు అత్యవసర పరిస్థితిలో ఆర్థిక భరోసాని ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఎవరికైనా ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పుడు ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదిస్తే తక్షణమే సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.పెడన నియోజకవర్గం లో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని అన్నారు.



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు.ఇప్పటికే నియోజకవర్గలో అనేక మందికి సీఎం ఆర్ ఎఫ్ ద్వారా సహాయం అందించామని భవిష్యత్తులో కూడా అవసరమైన కుటుంబానికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోపి నాగబాబు, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు తోట వేణు బొల్లా రాజేష్ ఎన్ ఏ బేగ్ జున్ను ప్రసాద్ సిరివెళ్ల శ్రీను సుబ్రహ్మణ్యం గంజాల గోవర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188